అదానీతో భేటీ అవాస్తవం!

● ఆ గ్రూపుతో ఒప్పందాల్లేవ్!

● అసెంబ్లీలో స్టాలిన్ ఖండన

చెన్నై, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయిన వివాదాస్పద పారిశ్రామిక వేత్త అదానీని తానెన్నడూ కలుసుకోలేదని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కూడా కోరలేదని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్పష్టం చేశారు. శాసనసభలో మంగళవారం ఉదయం ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అదానీ సంస్థలతో ఎలాంటి ఒప్పందాలు కూడా కుదుర్చుకోలేదన్నారు. పీఎంకే సభాపక్ష నాయకుడు జీకే మణి మాట్లాడుతూ సోలార్ విద్యుదుత్పత్తి పథకాలకు సంబంధించి అదానీ గ్రూపు సంస్థలు భారీ ఎత్తున ముడుపులు స్వీకరించాయంటూ అమెరికా ప్రభుత్వం ఆయనపై పలు కేసులు నమోదు చేసిందని, ఆ కేసుల్లో తమిళనాడు రాష్ట్రం పేరు కూడా ఉందని, సోలార్ విద్యుత్ పరికరాల విషయమై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిగాయని, ఆ సందర్భంగా ముడుపులు ముట్టాయని కూడా ఆరోపణలున్నాయని, వీటిపై ముఖ్యమంత్రి స్టాలిన్ సమగ్రమైన వివరణ ఇవ్వాలని పట్టుబట్టారు. పీఎంకే నేతలు అన్బుమణి, డాక్టర్ రాందాస్ ఇటీవలి కాలంలో తాను అదానీని కలుసుకున్నానని, సోలార్ విద్యుత్ పరికరాలను అదానీ గ్రూపు నుండి కొనుగోలు చేయడానికి రహస్య ఒప్పందాలు కుదుర్చుకున్నామని అదే పనిగా అసత్య ఆరోపణలు చేశారని స్టాలిన్ చెప్పారు. ఈ విషయమై విద్యుత్ శాఖ మంత్రి సెంథిల్ బాలాజీ సుదీర్ఘ వివరణ కూడా ఇచ్చారని, అదానీ సంస్థతో ఎలాంటి ఒప్పందాలు కుదుర్చుకోలేదని, అదేపనిగా అసత్య ఆరోపణలు చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కూడా హెచ్చరించిన విషయాన్ని స్టాలిన్ గుర్తు చేశారు. తానింతవరకూ అదానీని చూసింది లేదు.. మాట్లాడింది లేదని స్టాలిన్ శాసనసభా ముఖంగా ప్రకటించారు. అదానీ అవినీతి అక్రమాలపై పార్లమెంట్ సంయుక్త కమిటీ విచారణ జరపాలని ప్రధాన ప్రతిపక్షాలు ఒత్తిడి చేస్తున్నాయని, ఆ విషయమై పీఎంకే, బీజేపీ ప్రతిపక్షాల డిమాండ్‌కు మద్దతిస్తాయా? అని ప్రశ్నించారు. సోలార్ విద్యుత్ పరికరాల అవినీతి కేసులో రాష్ట్రానికి సంబంధాలున్నాయని వార్తలు వస్తున్నందువల్లే తాను ముఖ్యమంత్రి వివరణ కోరారని జీకే మణి చెప్పారు. వెంటనే స్టాలిన్ బదులిస్తూ పార్లమెంట్‌లో ఉమ్మడి కమిటీలతో విచారణ జరపాలని ప్రతిపక్షాల డిమాండ్‌కు పీఎంకే మద్దతిస్తుందో లేదో స్పష్టం చేయాలన్నారు. పీఎంకే నేతలు అసత్య ఆరోపణలు చేసి కపట రాజకీయాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. సభలో విద్యుత్‌శాఖ మంత్రి హాజరుకాకపోవడం వల్లే తానీ ఈ వివరణ ఇస్తున్నానని చెప్పారు. అదానీతో రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఒప్పందాలు కుదుర్చుకోలేదని, అదానీనీ తానెన్నడూ కలుసుకోలేదని, అదే నూటికి నూరుపాళ్ళ నిజమని స్టాలిన్ అన్నారు. అయితే ముఖ్యమంత్రి స్టాలిన్ సమాధానం తమకు సంతృప్తి కలిగించలేదంటూ పీఎంకే సభ్యులంతా జీకే మణి నాయకత్వంలో సభ నుండి వాకౌట్ చేశారు.





ఉ.వే. సామినాథ అయ్యర్ - శాసనసభలో ప్రకటన చేస్తున్న ముఖ్యమంత్రి

తమిళ సాహిత్య పునర్వికాస దినంగా

సామినాథ అయ్యర్ జయంతి

● అసెంబ్లీలో ప్రకటించిన స్టాలిన్

చెన్నై, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తమిళ సాహిత్యానికి విశిష్ట సేవలందించిన 'తమిళ పితామహులు'గా కీర్తింపబడుతున్న ఉ.వే. సామినాథ అయ్యర్ జయంతిని ఇకపై రాష్ట్ర ప్రభుత్వం తమిళ సాహిత్య పునర్వికాస దినం'గా నిర్వహించనున్నదని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. శాసనసభలో మంగళవారం ఉదయం ప్రశ్నోత్తరాల సమయం తర్వాత స్టాలిన్ మాట్లాడుతూ డాక్టర్ ఉ.వే. సామినాథఅయ్యర్ జయంతిని తమిళ సాహిత్య పునర్వికాస దినంగా పాటించాలని మాజీ మంత్రి కేపీమునుసామి విజ్ఞప్తి చేశారని, ఆ మేరకు ఇకపై సామినాథ అయ్యర్ జయంతిని తమిళ సాహిత్య పునర్వికాస దినంగా పాటించి వేడుకలను ఘనంగా జరుపుతామని సభికుల హర్షధ్వానాల మధ్యప్రకటించారు. అదే విధంగా డిప్యూటీ స్పీకర్ పిచ్చాండికి సభ్యులంతా జన్మదిన శుభాకాంక్షలు తెలపాలని సూచించారు. కుంభకోణం సమీపం ఉత్తమదనపురం అనే కుగ్రామంలో (1855లో) జన్మించిన సామినాథ అయ్యర్ బాల్యం నుండే తమిళభాష నేర్చుకునేందుకు ఆసక్తికనబరిచేవారు. సుప్రసిద్ధ తమిళ విద్వాన్ సుందరం పిళ్లై వద్ద శిష్యరికం చేసి తమిళ భాషపై పట్టు సాధించారు. 1880 నుండి 1903 వరకు కుంభకోణం ప్రభుత్వ కళాశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఆ తర్వాత 1903 నుండి 16 యేళ్లపాటు చెన్నై రాజధాని కళాశాలలో అధ్యాపకులుగా సేవలందించారు. తమిళ ప్రాచీన సాహిత్య తాళ పత్రాలను సేకరించి వాటికి ముద్రణరూపం కల్పించారు. 1887లో అత్యంత ప్రాచీన గ్రంథం చింతామణిని విడుదల చేశారు. అంతరించిపోవటానికి సిద్ధంగా ఉన్న సంగకాలపు సాహిత్య గ్రంథాలు, అగనానూరు, పురనానూరు, మణిమేఖలై వంటి గ్రంథాలను పునర్ముద్రించారు. తమిళసాహిత్యానికి అందించిన అపారమైన సేవలను గుర్తించి మద్రాసు విశ్వవిద్యాలయం ఆయనను గౌరవ డాక్టరేట్‌తో గౌరవించింది. అంతే కాకుండా మహామహోపాధ్యాయం, దక్షిణ కళానిధి అనే అవార్డులు కూడా అందుకున్నారు. స్వామినాథన్ తమిళ సాహిత్య సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం కూడా ఆయన స్మారక తపాలా బిళ్లను కూడా విడుదల చేసి గౌరవపరచింది. ఇంతటి విశేషాలు కలిగిన ఉ.వే. సామినాథ అయ్యర్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం తమిళ సాహిత్య పునర్వికాసదినంగా జరుపుకోనుండటం తనకెంతో ఆనందాన్ని కలిగిస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

హెచ్చరించిన తరువాతే సాత్తనూర్‌లో జలాల విడుదల...

సాత్తనూరు డ్యామ్ నుండి ముందస్తు హెచ్చరికలు చేయకుండా అదనపు జలాలను విడుదల చేశారనే ప్రతిపక్షాల ఆరోపణలను ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఉదయం ప్రశ్నోత్తరాల సమయం తరువాత అనుబంధ బడ్జెట్ దాఖలు, ప్రతిపాదనలపై చర్చల సందర్భంగా అన్నాడీఎంకే సభాపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) సాత్తనూరు డ్యామ్ నుంచి వేకువ జామును ఎలాంటి హెచ్చరికలు చేయకుండా 1.78 లక్షల ఘనపుటడుగుల నీటిని విడుదల చేసి వరదలు వచ్చేలా చేసారని ఆరోపించారు. వాతావరణ కేంద్రం రెడ్ అలెర్ట్ జారీ చేసినా ఆ వివరాలను ప్రజలకు సకాలంలో చెప్పి ఉంటే ఇంత భారీ నష్టం జరిగేది కాదని మాజీమంత్రి తంగమణి అన్నారు. గత అన్నాడీఎంకే పాలకులు చెంబరంబాక్కం జలాశయం నుంచి అదనపు జలాలను ఎలాంటి హెచ్చరిక చేయకుండా విడుదల చేశారంటూ పదేపదే ఆరోపణలు చేస్తున్న పాలకపక్షం సభ్యులు సాత్తనూరు డ్యామ్ నీటిని విడుదల చేయడంపై వివరణ ఇవ్వడం లేదన్నారు. సాత్తనూరు డ్యామ్‌లో నీటిమట్టం ప్రమాద స్థితికి చేరనుందని తెలియగానే ఐదుసార్లు డ్యామ్ పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్నవారికి హెచ్చరికలు జారీ చేసిన మీదటే జలాలను విడుదల చేశామని మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ వెల్లడించారు. ఈపీఎస్ జోక్యం చేసుకుంటూ చెంబరంబాక్కం జలాశయం నుంచి విడుదల చేసిన నీటి పరిమాణం కంటే సాత్తనూరు డ్యామ్ నుంచి విడుదల చేసిన నీరు ఎక్కువన్నారు. వేకువజాము 2.45 గంటలకు హెచ్చరికలు జారీ చేసిన పావుగంట తర్వాత అదనపు జలాలను విడుదల చేసి విల్లుపురం, కడలూరు, పుదుచ్చేరిలో వరదలకు కారణమయ్యారని ఆరోపించారు. చెంబరంబాక్కం జలాశయం నుంచి ముందస్తు హెచ్చరికలు చేయకుండా జలాలను విడుదల చేసినట్లు తాము ఆరోపించడం లేదని, కాగ్ అధికారుల నివేదికలోనే చెంబరంబాక్కం జలాల విడుదల మానవ తప్పిదమని సుస్పష్టంగా పేర్కొన్నారని సీఎం స్టాలిన్ అన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లోగా డీఎంకే ఫైల్-3 రెడీ!

● బీజేపీ నేత అన్నామలై



అడయార్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అధికార డీఎంకే నేతలు, అమాత్యులు అవినీతి అక్రమాలపై భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై దృష్టిసారించారు. డీఎంకే ఫైల్స్ పేరుతో ఈ అవినీతి చిట్టా తయారు చేసేందుకు కసరత్తు ప్రారంభించారు. 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రధాన ప్రచార అస్త్రంగా ఈ అవినీతి చిట్టాను ఉపయోగించుకోవాలనే లక్ష్యంతో ఆయన ఉన్నారు. నిజానికి 2023 నుంచి ఆయన డీఎంకే నేతలు, మంత్రుల అవినీతి చిట్టాను బహిర్గతం చేశారు. ఇందులో డీఎంకే ఎంపీ జగద్రక్షకన్, మంత్రి దురైమురుగన్, ముఖ్యమంత్రి స్టాలిన్ కుటుంబ సభ్యులకు సంబంధించిన అవినీతిని ఆయన బహిర్గతం చేశారు. అదే యేడాది జూలైలో రెండో అవినీతి జాబితా వెల్లడించగా, అందులో ప్రభుత్వ కాంట్రాక్టుల కేటాయింపుల్లో జరిగిన అవినీతిని బహిర్గతం చేశారు. ఆ తర్వాత డీఎంకే ఎంపీ టీఆర్ బాలు, మాజీ డీజీపీ జాఫర్ సేట్‌ల మధ్య జరిగిన సంభాషణల ఆడియోను లీక్ చేశారు. ఈ యేడాది ఫిబ్రవరి 4 న మరో ఆడియో రిలీజ్ చేయగా, ఇందులో డీఎంకే ఎంపీ ఏ.రాజా, జాఫర్ సేట్ మధ్య జరిగిన సంభాషణలున్నాయి.. అదేసమయంలో ఆస్తుల జాబితాను అన్నామలై బహిర్గతం చేయడంతో టీఆర్ బాలు పరువునష్టం దావా వేశారు. ఆ కేసు సైదాపేట మేజిస్ట్రేట్ కోర్టులో విచారణలో ఉంది. ఈ నేపథ్యంలో డీఎంకే ఫైల్స్ 3ని విడుదల చేసేందుకు ఆయన సన్నద్ధమవుతున్నారు. ఇదే విషయంపై అన్నామలై మాట్లాడుతూ, ఇప్పటివరకు డీఎంకే ఫైల్స్ 1, 2 విడుదల చేశామని త్వరలో డీఎంకే ఫైల్స్ 3 రూపంలో విడుదల చేస్తామన్నారు. పైగా వచ్చే ఎన్నికల్లో వీటిని తమ ప్రధాన ప్రచార అస్త్రాలుగా ఉపయోగించుకోవాలని ఆయన భావిస్తున్నారు.

నేత్రపర్వంగా రథోత్సవం



భక్తుల నడుమ రథంలో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

ప్యారీస్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవక్షేత్రం తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో మంగళవారం ఉదయం రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. తిరువణ్ణామలై క్షేత్రంలో కార్తీక దీపోత్సవాలు ఈ నెల 4వ తేదీ ధ్వజారోహణంతో ప్రారంభం కాగా, ఆ రోజు నుంచి ఉదయం, సాయంత్రం వినాయకుడు, సుబ్రహ్మణ్యుడు, చంద్రశేఖరుడు, పంచ మూర్తులను వివిధ వాహనాల్లో పుర వీధుల్లో ఊరేగించారు. దీపోత్సవాలలో 7వ రోజైన మంగళవారం ఉదయం అరుణాచలేశ్వరాలయంలో ఉన్నామలై అమ్మన్ సమేతుడై అన్నామలైయార్ స్వామి వారు ప్రత్యేక పూజలందుకున్నారు. అనంతరం ఆలయ ప్రధాన ద్వారం ముందు ఉన్న ఐదు రథాల వద్దకు ఉత్సవ మూర్తులను తరలించారు. రథోత్సవంలో కలెక్టర్ భాస్కర్ పాండియన్, ఎస్పీ డాక్టర్ సుధాకర్ సహా వేలాదిగా భక్తులు పాల్గొని రథాలను లాగారు. రాత్రి 7 గంటలకు అమ్మవారి రథాన్ని మహిళలు మాత్రమే లాగారు. ఈ రథం వెనుక చండీకేశ్వరుడి రథాన్ని చిన్నారులు లాగి మొక్కు తీర్చుకోవడం గమనార్హం. కాగా, ఈ ఏడాది పంచమూర్తుల రథోత్సవం నిర్వహించడంతో వేల సంఖ్యలో వచ్చిన భక్తులతో అరుణాచలేశ్వరాలయం కిక్కిరిసి కనిపించింది. మరోవైపు సంతానం కలిగిన దంపతులు చెరుకు గడలతో తయారుచేసిన చీరల ఊయ్యాలలో తమ పిల్లలను మోసుకుంటూ ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక దీపోత్సవాల్లో ప్రధానమైన 'మహాదీపోత్సవాలలో పాల్గొనే భక్తులకు ఆలయం తరుపున త్రాగునీరు, ఉచితవైద్య శిబిరాలు తదితర వసతులు దేవస్థానం వారు కల్పించారు. ఆలయ జాయింట్ కమీషనర్ జ్యోతి, ధర్మకర్తలు జీవానందం, రాజారామ్ తదితర అధికారులు ఏర్పాట్లను పరివేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

ఆన్‌లైన్‌లో దీపోత్సవ దర్శన టిక్కెట్లు...

వేలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై కార్తీక దీపోత్సవాల్లో భాగంగా ఈ నెల 13వ తేది తెల్లవారుజామున 4 గంటలకు ఆలయ ప్రాంగణంలో భరణి దీపం, సాయంత్రం 6 గంటలకు అన్నామలై కొండ శిఖరంపై మహాదీపం వెలిగించనున్నారు. పంచమూర్తులు, అర్ధనారీశ్వరుడు నాట్యం చేస్తూ దీప దర్శనం ఆలయంలోపల వెళ్లి మాత్రమే చూడవచ్చు. అయినా ఆలయం లోపల 11,500 మంది భక్తులు మాత్రమే కూర్చొనేందుకు స్థలముంది. ఇందులో ఉభయదారులు, పోలీసులు, ఆలయ ఉద్యోగులు, పల్లకి మోసేవారు, మంత్రులు, ఎమ్మెల్యేలున్నారు. ఈ పరిస్థితుల్లో భరణి దీపానికి ఒకరికి రూ.500, మహాదీపానికి ఒకరికి రూ.600, ప్రత్యేక దర్శనానికి రూ.100, రూ.500, రూ.1,000 టిక్కెట్లు విక్రయించనున్నారు. మహాదీపం వెలిగించేందుకు 4,500 కిలోల నెయ్యి ఆవిన్ నుంచి కొనుగోలు చేశారు. నెయ్యి కానుకగా ఇచ్చేవారు ఆలయ కార్యాలయంలో నగదు, ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చు.

భక్తులకు పలు నిబంధనలు...

కార్తీక దీపోత్సవాలకు 20లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో, భక్తులు పాటించాల్సి నిబంధనలను జిల్లా పోలీసు శాఖ విడుదల చేసింది.

- ఈ నెల 12 నుంచి 15వ తేది వరకు తిరువణ్ణామలైలో తాత్కాలిక బస్టాండ్లు, 116 కారు పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం 9363622330 అనే వాట్సాప్ నెంబరులో పేరు నమోదుచేసుకోవాలి.
- గిరి ప్రదక్షిణ మార్గంలో భక్తుల భద్రతకు రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌కు చెందిన వంద మంది పనిచేయనున్నారు.
- భక్తులు నాలుగు గోపురాల ముందు, గిరి ప్రదక్షిణ మార్గంలో కర్పూరం వెలిగించకూడదు.
- గిరిప్రదక్షిణ మార్గంలో పాదరక్షలు వదిలితే వాటిని స్వాధీనం చేసుకుంటారు.
- ఏ స్థలంలోనైనా అన్నదానం చేయరాదు. అన్నదానం చేసేవారు పోలీసుల అనుమతి పొందాలి.
- భక్తులకు ఏదైనా సమస్య వస్తే 'మే ఐ హెల్ప్ యూ' పేరుతో 50 ప్రాంతాల్లో ప్రత్యేక పోలీస్ బూత్‌లు
- ఫుత్‌పాత్ దుకాణాలకు అనుమతి లేదు.
- గిరిప్రదక్షిణ మార్గంలో గ్యాస్ స్టవ్ ఉంచి ఆహారం తయారుచేయరాదు. నిబంధనలు ఉల్లంఘించన వారిపై కఠిన చర్యలు
- పోలీసులు, అటవీ శాఖ అనుమతి లేకుండా కొండ పైకి ఎక్కరాదు. ఈ నిబంధనలను వేడుకలకు వచ్చే తమిళనాడు, కర్ణాటక, ఆంధ్ర సహా అన్ని రాష్ట్రాల భక్తులు పాటించాలి.



వెండి రథంపై స్వామివారి విహారం

అరుణాచలేశ్వరుడి కార్తీక దీపోత్సవాల్లో ఆరో రోజైన సోమవారం రాత్రి వెండి రథోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం 10 గంటలకు శివ పెరుమాళ్‌కు సేవచేసిన 63 మంది నాయన్మార్ల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు చేసి, వేర్వేరు వాహనా ల్లో మాడవీధుల్లో ఊరేగించారు. వీరితో పాటు గజ వాహనంలో వినాయకుడు, వెండి గజ వాహనంలో అన్నామలైయార్, ఉన్నామలై అమ్మవారు ప్రత్యేక అలంకరణలో మాడవీధుల్లో విహరించారు. రాత్రి 10 గంటలకు పంచమూర్తుల ఊరేగింపులో వెండి విమానంలో వినాయకుడు, వెండి ఆచ్చి విమానంలో వల్లి, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, 54 అడుగుల ఎత్తైన వెండి మహారథంలో ఉన్నామలై సమేత అరుణాచలేశ్వరుడు, విద్యుద్దీపాలంకరణలో వెండి ఇంద్ర విహనంలో పరాశక్తి అమ్మవారు, వెండి విమానంలో చండికేశ్వరుడు ఊరేగింపుగా వచ్చారు.

13న జిల్లాకు సెలవు...

కార్తీక దీపోత్సవాల్లో ప్రధానాంశమైన భరణి దీపం, మహా దీపం వెలిగించే కార్యక్రమం ఈ నెల 13న జరుగనుంది. ఆరోజున జిల్లాకు సెలవు దినంగా ప్రకటించారు. ఆ సెలవుకు బదులుగా ఈ నెల 21 (శనివారం)వ తేది పనిదినమని జిల్లా కలెక్టర్ భాస్కర పాండ్యన్ తెలిపారు.

బలపడిన అల్పపీడనం

● చెన్నైకి రెండు రోజుల భారీ వర్షసూచన



చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం అధికారి బాలచంద్రన్

ప్యారీస్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం సోమవారం పశ్చిమ దిశగా పయనించి బలపడిందని భారత వాతావరణ పరిశోధనా సంస్థ దక్షిణ మండల అధ్యక్షుడు బాలచంద్రన్ తెలిపారు. అయితే గత 24 గంటలుగా అక్కడే స్థిరంగా ఉన్న అల్పపీడనం ప్రస్తుతం తీరం వైపు పయనిస్తోందన్నారు. ఈ అల్పపీడనం దక్షిణాది జిల్లాల వైపు కదులుతోందని, ఓ వైపు ఈశాన్య రుతుపవనాల ప్రభావం, ఈ అల్పపీడనం కారణంగా రాజధాని నగరం చెన్నైలో బుధ, గురువారాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశాలు కూడా ఉన్నాయని చెప్పారు. ఇదే విధంగా మైలాడుతురై, నాగపట్నం, తంజావూరు, తిరువారూర్, కడలూరు జిల్లాలు, పుదుచ్చేరిలో ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తాయని వివరించారు. చెన్నై, శివగంగై, రామనాథపురం, తిరుచ్చి, తిరువళ్లూరు, చెంగల్‌పట్టు, కాంచీపురం సహా 11 జిల్లాల్లో భారీ నుంచి ఓ మోస్తరు వరకూ వర్షాలు కురుస్తాయని ఆయన వివరించారు.

ముల్లై పెరియార్‌పై కేరళ సీఎంతో చర్చించండి!

● స్టాలిన్‌కు ఈపీఎస్ సలహా



అసెంబ్లీకి వస్తున్న ఈపీఎస్ తదితరులు

చెన్నై, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెరియార్ స్మారక మండపాన్ని ప్రారంభించేందుకు కేరళ వెళ్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ ముల్లై పెరియార్ డ్యామ్ వివాదంపై చర్చలు జరపాలని అన్నాడీఎంకే సభాపక్ష నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) డిమాండ్ చేశారు. మంగళవారం శాసనసభలో జీరో అవర్‌లో ఈపీఎస్ మాట్లాడుతూ కేరళ ముఖ్యమంత్రి పినరాయ్ విజయన్‌ను కలుసుకోనున్న స్టాలిన్ ముల్లైపెరియార్ డ్యామ్ నిర్వహణ పనులకు వెళ్ళే రాష్ట్ర సాంకేతిక నిపుణులు, సిబ్బందని అడ్డుకోవడం సమంజసమేనా అని ప్రశ్నించాలని కోరారు. ప్రతియేటా ముల్లై పెరియార్ డ్యామ్ మరమ్మతు పనులను రాష్ట్ర ప్రభుత్వమే చేపడుతోందని, ఈ నేపథ్యంలో ఈ నెల 4న ఆ డ్యామ్ వద్ద మరమ్మతులు చేయడానికి ప్రజాపనుల శాఖ అధికారులు సామగ్రిని తీసుకెళ్తుంటే కేరళ ప్రభుత్వ అధికారులు అడ్డుకున్నారని, దీంతో మరమ్మతు పనులు ఆగిపోయాయని చెప్పారు. ఈ అంశాలన్నింటిని ముఖ్యమంత్రి స్టాలిన్ కేరళ ముఖ్యమంత్రి పినరాయ్ విజయన్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించుకుని రావాలని కోరారు. నీటి వనరుల శాఖ మంత్రి దురైమురుగన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రితో పాటు తాను కూడా కేరళ వెళుతున్నానని, ఈ వివాదాలు గురించి తప్పకుండా కేరళ సీఎంతో చర్చిస్తాన్నారు.. సీపీఎం సభ్యుడు నాగై మాలి మాట్లాడుతూ కేరళ ప్రభుత్వం తమిళనాడు ప్రభుత్వానికి ఆటంకాలు కలిగిస్తోందటూ ఈపీఎస్ చేసిన విమర్శలు సభ రికార్డుల నుండి తొలగించాలని పట్టుబట్టారు. దీనితో అన్నాడీఎంకే సభ్యులంతా లేచి తీవ్ర నిరసన ప్రకటించారు. మంత్రి దురైమురుగన్ మాట్లాడుతూ కేరళ ప్రభుత్వం తమిళనాడు ప్రభుత్వం చేపట్టే డ్యామ్ మరమ్మతు పనులను అడ్డుకోకూడదని కోర్టు తీర్పు వెలువరించిందని, ప్రస్తుతం వాహనాలను ఆ రాష్ట్ర అధికారులు అడ్డుకున్నారు కనుక ఈపీఎస్ మాటలను సభ రికార్డుల నుండి తొలగించాల్సిన అవసరం లేదన్నారు.

కోవై రహదారులకు మహర్దశ

● రూ.300 కోట్ల నిధులు మంజూరు: మంత్రి కేఎన్ నెహ్రూ



చెన్నై, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వాణిజ్యనగరంగా పేరుగడించిన కోయంబత్తూరు కార్పొరేషన్ పరిధిలోని రహదారుల మరమ్మతు, కొత్త రహదారుల నిర్మాణ పనులకు రూ.300 కోట్ల మేర నిధులు కేటాయించినట్లు నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ తెలిపారు. శాసనసభలో మంగళవారం అన్నాడీఎంకే సభ్యుడు ఎస్పీ వేలుమణి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ కోవై జిల్లాలో మూడో సమగ్రనీటి పథకాన్ని ఇటీవలే డిప్యూటీ ముఖ్యమంత్రి ఉదయనిధి ప్రారంభించారని, పలు ప్రాంతాల్లో సమగ్రనీటి పథకం కోసం స్థానికులు ప్రభుత్వానికి విజ్ఞప్తులు పంపుతున్నారని చెప్పారు. కోయంబత్తూరు కార్పొరేషన్ పరిధిలోని వెల్లూరు డంపింగ్ యార్డ్‌ను తొలగించే విషయమై ఆ కార్పొరేషన్ కమిషనర్‌తో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు కూడా చేపట్టమని అధికారులకు ఆదేశాలిచ్చామని, అదే సమయంలో కొత్త రహదారులను నాణ్యంగా నిర్మించేలా ప్రత్యేకనిధిగా రూ. 300 కోట్లను ముఖ్యమంత్రి స్టాలిన్ కేటాయించారని చెప్పారు.

సమాచార దృష్టి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

తండయార్‌పేట: టీహెచ్ రోడ్డు, డిడీర్ నగర్, సెరియన్ నగర్, సుడలైముత్తు వీధి, అశోక్ నగర్, నేషనల్ సిటీ, నమ్మమ్మ వీధి, పిచ్చమ్మాళ్ వీధి, నాగూరన్ గార్డన్, బాలకృష్ణా వీధి, ఫిషింగ్ హార్బర్ ప్రాంతం, ధనపాల్ నగర్, వెంకటేశన్ అలి వీధి, వీరరాఘవన్ వీధి, ఇరుసప్ మేస్త్రి వీధి, పూండి తంగమ్మాళ్ వీధి, ఏఈ ఆలయ వీధి, ఆవూరు ముత్తయ్య వీధి, వత్తవాడై వీధి, గాంధీ వీధి, వరదరాజన్ వీధి, మేట్టు వీధి, గ్రామ వీధి, క్రాస్ రోడ్డు, శివన్ నగర్, మంగమ్మాళ్ గార్డన్, జీవా నగర్, ఎంబీటీ అపార్ట్‌మెంట్స్

వ్యాసర్పాడి ఇండస్ట్రియల్ ఎస్టేట్: ఈఎస్ రోడ్డు, పీవీ కాలని, శాస్త్రి నగర్, ఇందిరా నగర్, వీరివాక్కం, వ్యాసర్పాడి ఇండస్ట్రియల్ ఎస్టేట్, గాంధీ నగర్, స్టీఫెన్ రోడ్డు, వ్యాసర్ నగర్, పుదునగర్ క్రాస్ గాంధీ నగర్, ఎంబీఎం వీధి, వ్యాసర్పాడి మార్కెట్ వీధి, సెంట్రల్ క్రాస్ 10వ వీధి, ఎంకేబీ నగర్ 19వ వీధి, ఒకటవ మెయిన్ రోడ్డు, 1 నుంచి 6 క్రాస్ వీధులు, ఈస్ట్ క్రాస్ వీధి, 10 నుంచి 19 వీధులు, ఏబీసీ కల్యాణపురం, సత్యమూర్తి నగర్ 1 నుంచి 25, 42వ వీధి, సాయియార్ గార్డన్ 1 నుంచి 4 వీధులు, పుల్లా వీధి 1 నుంచి 4 వీధులు, ఉదయసూర్యన్ నగర్ బ్లాక్‌లు, ఎస్‌పి కాలని, శర్మా నగర్.

నాలుగు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు బోగీలు

పెరంబూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఉంచుకొని నాలుగు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు బోగీలు అనుసంధానం చేయనున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకారం, ఆంధ్ర రాష్ట్రం విశాఖపట్టణం-ఎగ్మూర్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌కు 2025 జనవరి 14 నుంచి మార్చివరకు, ఎగ్మూర్-విశాఖ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 15 నుంచి మార్చి వరకు అదనంగా ఒక ఏసీ, ఒక స్లీపర్ బోగీ అనుసంధానం చేయనున్నారు. అలాగే, సంబల్‌పూర్-ఈరోడ్-సంబల్‌పూర్ ప్రత్యేక రైళ్లకు ఈ నెల 13 నుంచి 27వ తేది వరకు ఒక ఏసీ, ఒక స్లీపర్ క్లాస్ బోగీలు ఏర్పాటుచేయనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

నేడు ఈఎస్ఐ గ్రీవెన్స్

పెరంబూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ చెన్నై మండల పరిధిలోని కార్మికుల గ్రీవెన్స్ బుధవారం జరుగనుంది. నుంగంబాక్కం స్టెర్లింగ్ రోడ్డులో ఉన్న చెన్నై మండల కార్యాలయంలో మధ్యాహ్నం 2.30 గంటలకు ఈ శిబిరం జరుగనుంది. పారిశ్రామికవేత్తలు, కార్మికులు, బీమాదారులు, ఈఎస్ఐ చందాదారులు ఈ శిబిరంలో పాల్గొని సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని అధికారులు తెలిపారు.

తిరువణ్ణామలైలో మూడు రోజులు మద్యం దుకాణాల మూత

వాషర్‌మెన్‌పేట,డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై జిల్లాలో మూడు రోజులు మద్యం దుకాణాలు మూసివేయాలని జిల్లా కలెక్టర్ భాస్కర పాండ్యన్ ఉత్తర్వులు జారీచేశారు. అరుణాచలేశ్వరుడి కార్తీక దీపోత్సవాల్లో ఈ నెల 13న ఆలయ ప్రాంగణంలో తెల్లవారుజామున 4 గంటలకు భరణి దీపం, సాయంత్రం 6 గంటలకు అన్నామలై కొండపై మహాదీపం వెలిగించనున్నారు. ఈ వేడుకలను పురస్కరించుకొని జిల్లాలో ఈ నెల 12 నుంచి 14వ తేది వరకు మద్యం దుకాణాలు మూసివేయాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పుత్తానత్తంలో భూ ప్రకంపనలు

పెరంబూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా మనప్పారై సమీపం పుత్తానత్తం ప్రాంతంలో భూ ప్రకంపనలు సంభవించినట్లు సమాచారం. సుమారు 5 సెకన్ల పాటు సాగిన భూ ప్రకంపనలకు ఇళ్లలోని పాత్రలు కిందపడ్డాయి. దిగ్భ్రాంతి చెందిన ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనపై రెవెన్యూ శాఖ అధికారులు పరిశీలిస్తున్నారు.

13 నుంచి చదురగిరికి భక్తుల అనుమతి

వాషర్‌మెన్‌పేట,డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): చదురగిరి సుందరమహాలింగం ఆలయానికి ఈ నెల 13 నుంచి నాలుగు రోజులు భక్తులను అనుమతిస్తున్నట్లు అటవీ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. విరుదునగర్ జిల్లా ఒత్తిరాయిపు సమీపంలోని పశ్చిమ కనుమల కొండ ప్రాంతంలో వెలసిన సుం దరమహాలింగం ఆలయానికి ప్రతి నెలా ప్రదోషం, పౌర్ణమి, అమావాస్య రోజుల్లో భక్తులను అనుమతిస్తుంటారు. ఈ నేపథ్యంలో, ఈ నెల ప్రదోషం, పౌర్ణమి సందర్భంగా శుక్రవారం నుంచి 16వ తేది వరకు భక్తులను అనుమతించనున్నారు. రాత్రివేళ ఆలయంలో బస చేసేందుకు అనుమతించమని, అగ్నిప్రమాదాలు సంభవించే వస్తువులను తీసుకెళ్లరాదని, దర్శనం చేసుకున్న భక్తులు సమీపంలోని జలపాతాల్లో స్నానాలకు వెళ్లరాదని సూచించిన అధికారులు, పిల్లలు, వృద్ధులు కొండ ఆలయానికి వెళ్లరాదని పేర్కొంటున్నారు.

తిరుచ్చి-మస్కట్ మధ్య అదనపు విమానాలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి-మస్కట్ మధ్య ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ అదనపు విమాన సేవలు అందించనుంది. తిరుచ్చి, పరిసర ప్రాంతాల నుంచి అధికంగా ప్రజలు ఒమన్ వెళ్తుంటారు. తిరుచ్చి నుంచి మస్కట్‌కు ఇండిగో, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థలు విమానాలు నడుపుతున్నాయి. వారంలో కొద్దిరోజులు మాత్రమే ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ బుధవారం మాత్రమే తిరుచ్చి నుంచి మస్కట్‌కు నేరుగా విమానాలు నడుపుతోంది. ఆ క్రమంలో, జనవరి 6వ తేది నుంచి సోమవారం కూడా విమాన సేవలు నడుపుతున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది.

వరదసాయం కోసం బాధితుల రాస్తారోకో

● కోట్టకుప్పంలో స్తంభించిన ట్రాఫిక్



ఆందోళనకారులతో చర్చలు జరుపుతున్న పోలీసు అధికారులు - రోడ్డుపై బైఠాయించిన మహిళలు

చెన్నై,డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా కోట్టకుప్పం రౌండ్‌ఠాణా ప్రాంతం వద్ద మంగళవారం ఉదయం ఫెంగల్ తుఫాన్, వరద బాధితులు రాస్తారోకో నిర్వహించడంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలు స్తంభించాయి. మూడు కిలో మీటర వరకూ వాహనాలు ఆగిపోయాయి. విల్లుపురం కోట్టకుప్పం పట్టణపంచాయతీ పరిధిలోని పెరియకోట్టకుప్పం ప్రాంతంలో 10, 11 వార్డుల ప్రజలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.2వేల ఆర్థికసాయంతో పాటు ఇతర సహాయాలు ఏవీ అందలేదు. అంతే కాకుండా వర్ష, వరద బాధితులను పరామర్శించడానికి అధికారులు ఎవరూ ఆ ప్రాంతాల్లో పర్యటించలేదు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఆ రెండు వార్డుల్లో నివసిస్తున్నవారంతా సమావేశమై మంగళవారం ఉదయం రాస్తారోకో జరపాలని నిర్ణయించారు. ఆ ప్రకారమే మంగళవారం ఉదయం 6.30 గంటలకు కోట్టకుప్ప రౌండ్‌ఠాణా ఈస్ట్‌కోస్ట్ రోడ్డులో వేయిమందికిపైగా మహిళలు, యువకులు, రైతులు బైఠాయించి రాస్తారోకో చేశారు. ఆ సమయంలో అర్ధ సంవత్సరం పరీక్షలు రాయడానికి వెళ్తున్న విద్యార్థుల వాహనాలను నిలిపివేశారు. కాలాపట్టు ప్రాంతం నుంచి పుదుచ్చేరి వైపు వెళ్లే వాహనాలు, ప్రభుత్వ బస్సులు నిలిచాయి. కోట్టకుప్పం రౌండ్‌ఠాణా నుంచి శివాజీ రోడ్డు వరకు వాహనాల రాకపోకలు స్తంభించాయి. కాసేపయ్యాక అర్ధసంవత్సరం పరీక్షలు రాయడానికి వెళ్తున్న విద్యార్థుల కోరిక మేరకు ఆందోళనకారులు స్కూలు వాహనాలను ఆ మార్గంలో వెళ్లేందుకు అనుమతించారు. ఈ ఆందోళన గురించి తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని రోడ్డుపై బైఠాయించిన మహిళలతో చర్చలు జరిపారు. ఆ సందర్భంగా మహిళలకు, పోలీసులకు నడుమ వాగ్వాదం జరగడంతో ఉద్రిక్తంగా మారింది. సుమారు రెండు గంటలపాటు కొనసాగిన ఈ రాస్తారోకో కారణంగా కోట్టకుప్పం రౌండ్‌ఠాణా ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

వెయ్యి చెక్ డ్యామ్‌లను నిర్మిస్తాం

● మంత్రి దురైమురుగన్

అడయార్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా జలవనరుల ప్రాంతాల్లో వెయ్యి చెక్ డ్యామ్‌లను నిర్మించనున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి దురైమురుగన్ తెలిపారు. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా, విపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, రిజర్వాయర్ల కంటే చెక్ డ్యామ్‌లతోనే అధిక ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 500 చెక్ డ్యామ్‌లను నిర్మించేందుకు చర్యలు చేపట్టామని, మరో 500 చెక్ డ్యామ్‌లను నిర్మించేలా దృష్టిసారించినట్లు తెలిపారు.

రోడ్డు పక్కన పులి విశ్రాంతి ..!

● పర్యాటకులకు అటవీ శాఖ హెచ్చరిక

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ముదుమలై పులుల శరణాలయంలోని రోడ్డు పక్కన కొద్దిరోజులుగా ఓ పులి విశ్రాంతి తీసుకుంటోంది. ఆ సమయంలో ఆ మార్గంగా వెళ్లిన పర్యాటకులు తమ వాహనాలను నిలిపి, పులి విశ్రాంతి తీసుకొనే దృశ్యాలు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ విషయమై అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ... కొద్దిరోజులుగా ముదుమలై రోడ్డు పక్కన ఓ పులి విశ్రాంతి తీసుకుంటోందని తెలిపారు. వాహన చోదకులు, పర్యాటకులు ఆ ప్రాంతంలో వాహనాలు నిలపడం, పులిని వీడియో తీయడం తదితరాలు చేయరాదన్నారు. ఒకవేళ అలా చేస్తే పులి వారిపై దాడిచేసే అవకాశముందని, అందువల్ల పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

అరుణాచలంపై మహాదీపం వెలిగిస్తాం!

● మంత్రి శేఖర్‌బాబు

అడయార్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి యేటా వెలిగినట్టుగానే ఈ యేడాది కూడా తిరువణ్ణామలై అరుణాచలేశ్వర కొండ శిఖరాగ్రంపై మహాదీప జ్యోతి వెలుగుతుందని దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. మంగళవారం విపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ, సంగం కాలం నుంచి ఈ మహాదీప వేడుకలు సంప్రదాయంగా జరుగుతున్నాయని, ఈ యేడాది కూడా అలానే జరుగుతాయని చెప్పారు. కార్తీక పౌర్ణమి పర్వదినాన మహాజ్యోతిని దర్శనం చేసుకునేందుకు సుమారు 40 లక్షల మంది తిరువణ్ణామలై వస్తారని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. కార్తీక దీపం వేడుకల్లో చిన్న అపశృతి లేకుండా విజయవంతంగా పూర్తి చేయాలని సీఎం స్టాలిన్ ఆదేశించారని గుర్తుచేశారు.

మంత్రి చేతిలో నా భవిష్యత్తు : సెల్వపెరుంతగై

అడయార్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వచ్చే దఫా తాను ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం అనేది రాష్ట్ర మంత్రి దురైమురుగన్ చేతిలో ఉందని టీఎన్‌సీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే సెల్వపెరుంతగై అన్నారు. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తన సొంత నియోజకవర్గమైన శ్రీపెరుంబుదూరు పరిధిలోని ముల్లై నగర్, ధనలక్ష్మి నగర్, అష్టలక్ష్మి నగర్ తదితర ప్రాంతాల్లో వర్షపునీరు చేరిందన్నారు. వరద బాధిత ప్రాంతాల్లో సహాయక చర్యలను పూర్తి చేసి బాధితులను అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. అలాగే, వరద నీటి కాల్వల నిర్మాణం తదితర పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అందువల్ల తాను మళ్లీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యే విషయం మంత్రి దురైమురగన్ చేతిలో ఉందని ఆయన పేర్కొన్నారు.

న్యూడుల్స్ తిన్న చిన్నారులకు అస్వస్థత

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లాలో న్యూడుల్స్ తిన్న ఇద్దరు చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. త్రిభువనం పుదూర్ ప్రాంతానికి చెందిన సంతానరాజ్ కుమారుడు రుద్రప్రియన్, సుజిత్‌మండల్ కుమార్తె అహాన్సా మండల్ సోమవారం సాయంత్రం త్రిభువనంలోని ప్రైవేటు ఫాస్ట్‌ఫుట్ సెంటర్ నుంచి న్యూడిల్స్ తీసుకొచ్చి తిన్నారు. కొద్దిసేపట్లో ఇద్దరు చిన్నారులు వాంతులు చేసుకుంటూ అస్వస్థతకు గురయ్యారు. తల్లిదండ్రులు వారి తిన్న కప్ పరిశీలించగా, అది కాలపరిమితి చెందిందని గుర్తించారు. పిల్లలను ఆస్పత్రికి తరలించిన తల్లిదండ్రులు, ఈ విషయమై ఆహార భద్రతా శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.

అరుణాచలేశ్వరునికి గొడుగుల సమర్పణ

వేలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హిందూ ఆలయ రక్షణ సమితి తరఫున దీపోత్సవాల సందర్భంగా తిరువణ్ణామలై అరుణచలేశ్వరునికి గొడుగు, వెండి కిరీటం, వేలూరు జలకంఠేశ్వరునికి గొడుగు వచ్చే వేడుకలు జరిగాయి. శ్రీపురం నారాయణి పీఠం, శక్తి అమ్మ ఆశీస్సులతో శ్రీపురం ఆనంద నటరాజన్ ఆలయంలో జరిగిన కార్యక్రమంలో శక్తి అమ్మ ప్రారంభించారు. స్వర్ణాలయం డైరెక్టర్ డా.సురేష్ సహా పలువురు పాల్గొన్నారు.



గొడుగులతో శక్తి అమ్మ

నగరంలో పుష్ప ప్రదర్శన

● ఊటీ నుంచి 6 లక్షల పూల మొక్కలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిర్వహించనున్న పుష్ప ప్రదర్శనకు నీలగిరి జిల్లా ఊటీ నుంచి 6 లక్షల పూల మొక్కలు దిగుమతయ్యాయి. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో సెమ్మొళి పార్క్‌లో పుష్ప ప్రదర్శన నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది ప్రదర్శన ఈ నెలాఖరులో ప్రారంభం కానుంది. ఈ ప్రదర్శన కోసం రాష్ట్రంలోని ఉద్యానవన శాఖ ఫాంలో పూల మొక్కల సంరక్షణ మూడు నెలలుగా జరుగుతోంది. ఈ నేపథ్యంలో, ఊటీ నుంచి 6 లక్షల పూల మొక్కలు సోమవారం సెమ్మొళి పార్క్‌కు చేరుకున్నాయి. ఈ విషయమై ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ బీబీత మాట్లాడుతూ.. సెమ్మొళి పార్క్‌లో నిర్వహించనున్న పుష్ప ప్రదర్శన కోసం ఊటీ బొటానికల్ గార్డన్ నుంచి మేరీ, గోల్డ్, సాల్వియా సహా 32 రకాలకు చెందిన 6 లక్షల పూలు సిద్ధం చేశామని, ఈ పూలను వాహనాల ద్వారా పార్క్‌కు తీసుకొచ్చినట్లు తెలిపారు.



పుష్ప ప్రదర్శనకు ఊటీ నుంచి వచ్చిన పూల మొక్కలు

ఆండవన్ ఉత్తర్వుల పెట్టెలో 'కాశీ తీర్థం'

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగేయం సమీపం శివన్‌మలై సుబ్రమణ్యస్వామి ఆలయ ఉత్తర్వుల పెట్టెలో సోమవారం కాశి తీర్థం ఉంచి పూజలు చేస్తున్నారు. తిరుప్పూర్ జిల్లా కాంగేయం సమీపంలోని శివన్‌మలై సుబ్రమణ్యస్వామి ఆలయానికి ఓ ప్రత్యేకత ఉంది. ఈ ఆలయంలో 'ఆండవన్ ఉత్తర్వుల పెట్టె' ఉంది. ఈ పెట్టెలో ఉంచే వస్తువు ప్రపంచంలో జరిగే పరిమాణాలను సూచిస్తుందని భక్తుల నమ్మకం. అదే సమయంలో, ఆ పెట్టెలో ఏ వస్తువు ఉంచాలో మురుగన్ ఎవరైనా భక్తుల కలలో కనిపించి తెలియజేస్తుంటారని నమ్మకం. ఆ ప్రకారం, గత నెల 12వ తేది నుంచి మట్టి దీపం ఉంచి పూజలు చేస్తున్నారు. ఈ క్రమంలో, తిరుప్పూర్ జిల్లా ఉడుమలైపేటకు చెందిన సేర్మరాజ్ అనే భక్తుడికి పెరుమాళ్ దర్శనమిచ్చి, పెట్టెలో కాశీ తీర్థం ఉంచాలని సూచించినట్లు తెలిసింది. సేర్మరాజ్ ఈ విషయాన్ని ఆలయ నిర్వాహకులకు తెలుపడంతో, ఆలయంలోని ఉత్తర్వుల పెట్టె (అద్దాల పెట్టె)లో సోమవారం నుంచి కాశీ తీర్థంతో కూడిన కలశాన్ని ఉంచి పూజలు చేస్తున్నారు.



అద్దాల పెట్టెలో ఉంచిన కాశీ తీర్థం

దేవాంగ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్యారీస్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నై పాతచాకలిపేట, బసవయ్యన్ వీధిలోని సంఘ కార్యాలయంలో మంగళవారం ఉదయం 'చెన్నపురి దేవాంగ సంఘం' అధ్యక్షులు కోణంకి జనార్ధనం, సంఘ నాయకులతో కలిసి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవాంగ సంఘం అధ్యక్షులు కోణంకి జనార్ధనం మాట్లాడుతూ దేవాంగ కులస్థులు అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తున్నారని, అయినా కూడా పేదకుటుంబాల వారికి ఉన్నత విద్య కష్టమవుతుందని, ప్రభుత్వం కూడా ప్రత్యేక పథకాలు పెట్టి కులాభివృద్ధికి దోహద చేయవలసింది ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు దోనపర్తి తారాచంద్రన్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి బండారు సోమ సుందర్, దేవాంగ సంఘ కన్వీనర్, సీనియర్ కార్యనిర్వాహకులు మాచర్ల మునిరత్నం, కార్యనిర్వాహకుడు, కపిల వినాయక దేవస్థాన ధర్మకర్త పొన్నేరి రాధాకృష్ణ, సంఘ కుల దైవమైన శ్రీరామలింగ చౌడేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.



కొత్త క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

మాజీ ఎంపీ మోహన్ కన్నుమూత

చెన్నై, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): డీఎంకే నేత, కోయంబత్తూరు మాజీ పార్లమెంట్ సభ్యుడు మోహన్ (81) మంగళవారం ఉదయం కన్నుమూశారు. 1980లో ఆయన ఎంపీగా, 1989లో సింగానల్లూరు శాసనసభ్యుడిగా గెలిచారు. డీఎంకే ప్రచార కార్యదర్శి, పార్టీ తీర్మానాల కమిటీ డిప్యూటీ కార్యదర్శిగా పనిచేశారు. ఎమర్జన్సీ రోజుల్లో అరెస్టయి యేడాదిపాటు జైలు శిక్ష అనుభవించారు. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి, ప్రస్తుత ముఖ్యమంత్రి స్టాలిన్‌కు అత్యంత సన్నిహితులు. వృద్ధాప్య సమస్యలు, అనారోగ్యంతో ఇంటివద్దే చికిత్స తీసుకుంటూ మంగళవారం వేకువజాము మృతి చెందారు. మోహన్‌కు సుగుణా అనే భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. మోహన్ మృతి పట్ల డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రగాఢ సంతాపం వ్యక్తంచేశారు. మాజీ ఎంపీ మోహన్ మృతి సమాచారం అందగానే విద్యుత్ శాఖ మంత్రి సెంథిల్‌బాలాజీని వెంటబెట్టుకుని డిప్యూటీ సీఎం ఉదయనిధి కోవై నగరానికి చేరుకున్నారు. మోహన భౌతికకాయానికి నివాళలర్పించి, కుటుంబీకులను ఓదార్చారు.



(ఫైల్‌ఫొటో)



మోహన్ భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబీకులను ఓదార్చుతున్న డిప్యూటీ సీఎం ఉదయనిధి

తిరువణ్ణామలైకు ప్రత్యేక రైళ్లు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయ కార్తీక దీపోత్సవాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ● నెం.06130 విల్లుపురం-తిరువణ్ణామలై మెము ఎక్స్‌ప్రెస్ స్పెషల్ ఈ నెల 13,14,15 తేదీల్లో విల్లుపురం నుంచి ఉదయం 9.25 గంటలకు బయల్దేరి 11.10 గంటలకు తిరువణ్ణామలై చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06129 తిరువణ్ణామలై-విల్లుపురం మెము ఎక్స్‌ప్రెస్ స్పెషల్ ఈ నెల 13,14,15 తేదీల్లో తిరువణ్ణామలైలో మధ్యాహ్నం 12.40 గంటలకు బయల్దేరి 2.15 గంటలకు విల్లుపురం చేరుకుంటుంది. ● నెం. 06145 విల్లుపురం-తిరువణ్ణామలై మెము ఎక్స్‌ప్రెస్ స్పెషల్ ఈ నెల 13,14,15,16 తేదీల్లో విల్లుపురంలో రాత్రి 9.15 గంటలకు బయల్దేరి 10.45 గంటలకు తిరువణ్ణామలై చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06146 తిరువణ్ణామలై-విల్లుపురం మెము ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13,14,15,16 తేదీల్లో తిరువణ్ణామలై నుంచి వేకువజామున 3.30 గంటలకు బయల్దేరి తెల్లవారుజామున 5 గంటలకు విల్లుపురం చేరుకుంటుంది.

10,109 ప్రత్యేక బస్సులు...

తిరువణ్ణామలై కార్తీక దీపోత్సవాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 10,109 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్‌ఈటీసీ) ఒక ప్రకటనలో తెలిపింది. శుక్రవారం నుంచి 15వ తేది వరకు చెన్నై నుంచి తిరువణ్ణామలైకు 1982 ప్రత్యేక బస్సులు, రాష్ట్రంలోని వివిధ నగరాల నుంచి 8,127 బస్సులు నడుపనున్నారు. భక్తులు ముందుగానే www.tnstc.in అనే వెబ్‌సైట్‌లో రిజర్వేషన్ చేసుకొని ప్రయాణించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

జెండా కొయ్యకు అనుమతులు: వీఏఓ సస్పెన్షన్

పెరంబూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మదురై వెల్లిసంద ప్రాంతంలో 45 అడుగుల జెండా స్తంభానికి అనుమతి వ్యవహారంలో వీఏఓ పరమశివంపై సస్పెన్షన్ వేటుపడింది. 25 అడుగులకు మాత్రమే అనుమతులున్న నేపథ్యంలో, 45 అడుగులకు అనుమతులిచ్చినట్లు ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన అధికారులు అందించిన నివేదిక ఆధారంగా పరమశివంను సస్పెండ్ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ పళనిపాండి సస్పెండ్ అయిన నేపథ్యంలో, మంగళవారం వీఏఓపై కూడా వేటుపడింది.

భార్యను హతమార్చి భర్త ఆత్మహత్య

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లా పల్లడం సమీపంలో భార్యను హతమార్చిన వ్యక్తి తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు... లక్ష్మీనగర్‌కు చెందిన సిలంబరసన్-అఖిలాండేశ్వరి దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. చికెన్ దుకాణం నడుపుతున్న సిలంబరసన్ సోమవారం దుకాణం మూసి ఇంటికెళ్లాడు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చిన కుమారుడు, తన తల్లి రక్తపుమడుగులో పడి ఉందని, పక్కనే తండ్రి ఉరేసుకొని చనిపోయాడని ఏడుస్తూ చెప్పాడు. బాలుడి మాటలకు దిగ్భ్రాంతి చెందిన చుట్టుపక్కల వారు పల్లడం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. ఈ వ్యవహారంపై పోలీసులు జరిపిన విచారణలో... భార్యాభర్తల మధ్య కొద్దిరోజులుగా గొడవ పడుతుండేవారని, సిలంబరసన్ మద్యానికి బానిస కావడమే ఇందుకు కారణమని తెలిసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

క్రిస్మస్ తాత వేషంలో నాట్యం చేస్తూ మృతి

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సెమీ క్రిస్మస్ వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. వేడుకల్లో క్రిస్మస్ తాత వేషధారణతో నృత్యం చేస్తున్న వ్యక్తి హఠాత్తుగా మృతిచెందిన ఘటన నీలగిరి జిల్లాలో చోటుచేసుకుంది. క్రిస్మస్ నెల నవంబరు 24వ తేది అర్ధరాత్రి నుంచి ప్రారంభమైంది. వివిధ క్రైస్తవ సంఘాలు తమ ప్రార్థనా మందిరాలకు వచ్చే సభ్యుల ఇళ్లకు రాత్రి సమయాల్లో పాటలు పాడుకుంటూ వెళ్లి శుభాకాంక్షలు చెబుతుంటారు. ఆ ప్రకారం, ఘటన జరిగిన రోజు నీలగిరి జిల్లా కున్నూర్ కంపెనీ మాత ఆలయం నుంచి బయల్దేరిన బృందంలో ధర్మపురి జిల్లాకు చెందిన ఫ్రాన్సిస్ (58) క్రిస్మస్ తాత వేషధారణలో క్రైస్తవ పాటలకు నృత్యం చేస్తూ అందర్నీ అలరిస్తున్నాడు. ఆయన నృత్యం చేస్తూ హఠాత్తుగా కిందపడి మృతిచెందాడు. ఈ ఘటన బృందం సభ్యులు, ఆలయ సభ్యులను తీవ్ర మనోవేదనకు గురిచేసింది.



మృతుడు ఫ్రాన్సిస్ (ఫైల్‌ఫొటో)

కుట్రల నిరోధానికి రైల్వే ట్రాక్‌లపై కెమెరాలు

పెరంబూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నేరాలు, కుట్రలు తదితర చర్యలు నిరోధించేలా రైల్వే ట్రాక్ సమీపంలో 'సీసీ కెమెరాలు' ఏర్పాటు చేస్తున్నారు.. ఇటీవల కాలంలో రైళ్లపై రాళ్లు రువ్వడం, పట్టాలపై బండరాళ్లు, టైర్లు ఉంచడం, సిగ్నల్స్ ధ్వంసం తదితర ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. వాటిని పరిశీలించిన రైల్వే భద్రతా దళ అధికారులు, 50 ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని సిఫారసు చేశారు. ఆ ప్రకారం బేసిన్ బ్రిడ్జి, కొరుక్కుపేట, వ్యాసర్పాడి, తండయార్‌పేట, కాట్పాడి, తిరువళ్లూర్, గుమ్మిడిపూండి, విల్లుపురం, తిరువారూరు, మైలాడుదురై, దిండుగల్, కారైక్కుడి, కేరళ రాష్ట్రం తిరూర్, సోర్నరూరు సహా 50 ప్రాంతాల్లోని రైల్వే ట్రాక్ సమీపంలోని స్తంభాలపై సీసీ కెమెరాలు ఏర్పాటుచేయనున్నారు. ప్రస్తుతం, బేసిన్ బ్రిడ్జి సమీపంలో 10కి పైగా కెమెరాలు ఏర్పాటుచేసినట్లు అధికారులు తెలిపారు.



రైల్వే ట్రాక్ పక్కన పెట్టిన సీసీ కెమెరాలు

విద్యార్థుల బాహాబాహీ

తిరుత్తణి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా పొదటూరుపేటలో మంగళవారం విద్యార్థులు రెండు గ్రూపులుగా విడిపోయి పరస్పరదాడులకు పాల్పడ్డారు. పొదటూరుపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 2 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. పొదటూరుపేట, చుట్టుపక్కల గ్రామాలు, నగరి, ఏకాంబరం తదితర ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామాల విద్యార్థులు కూడా ఈ పాఠశాలలో చదువుతూ, రోజూ పాఠశాలకు బస్సులు, సైకిళ్లపై వస్తుంటారు. కొద్దిరోజుల క్రితం పాఠశాలలో విద్యార్థుల మధ్య వివాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో, పొదటూరుపేట బస్టాండ్ ఉదయం విద్యార్థులు, ప్రయాణికులు బస్సు కోసం వేచి ఉన్నారు. ఆ సమయంలో అక్కడున్న విద్యార్థులు రెండు వర్గాల విడిపోయి దాడులకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పొదటూరుపేట ఎస్‌ఐ సుకాంతి, పోలీసులు అక్కడకు చేరుకోగా విద్యార్థులు పరారయ్యారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించిన ఎస్‌ఐ, ఆ సమయంలో బస్సు ఫుట్ బోర్డుపై ప్రయాణిస్తున్న విద్యార్థులు లోపలికి వెళ్లాలని, మరోసారి ఫుట్ బోర్డు ప్రయాణం చేస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ విద్యార్థులను హెచ్చరించారు.



బస్టాండ్‌లో విద్యార్థుల వాగ్వివాదం

సురుళి జలపాతం వద్ద పర్యాటకుల నిషేధం


వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సురుళి జలపాతం దగ్గరకు పర్యాటకులు వెళ్లకుండా నిషేధం విధించారు. తేని జిల్లా పశ్చిమ కనుమల కొండ ప్రాంతాల్లో ఉన్న జలపాతం వరకు ప్రతిరోజు పర్యాటకులు అధికంగా వస్తుంటారు. జలపాతం వద్ద స్నానాలు, ప్రకృతి అందాలు ఆస్వాదిస్తూ పర్యాటకులు ఉత్సాహంగా గడుపుతుంటారు. ఈ నేపథ్యంలో, ఈ ప్రాంతంలో కొద్దిరోజులుగా అడవి ఏనుగుల గుంపు మకాం వేసింది. దీంతో, పర్యాటకుల భద్రత దృష్ట్యా పర్యాటకులు, అయ్యప్ప భక్తులు సురుళి జలపాతం వద్దకు రావడంపై నిషేధం విధిస్తూ అటవీ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

కీలంబాక్కంలో బస్సు డ్రైవర్ల నిరసన

ప్యారీస్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): కిలాంబాక్కం బస్‌స్టేషన్‌లో రవాణా సంస్థ బస్సు డ్రైవర్లు ఆకస్మికంగా ఆందోళనకు దిగారు. చెన్నై శివారులోని ప్రజలు తమ స్వస్థలాలకు చేరుకునేందుకు కీలంబాకం బస్ టెర్మినల్‌కి వెళ్ళి, అక్కడి నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో బయలుదేరుతారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఆ బస్‌టెర్మినల్ గేటు నుంచి ఇంటర్ సిటీ బస్సులు ప్లాట్‌ఫారమ్‌కు వెళ్లేందుకు బ్యాటరీ వాహనాలను నడుపుతుంటారు. సిటీ బస్‌లు వెళ్లే ఒకటో నెంబర్ ప్లాట్‌ఫారంను గత కొన్ని రోజులుగా మూసివేశారు. ఈ క్రమంలో ప్రైవేటు బస్సుల సిబ్బంది ప్రయాణికులను తమ బస్సులలో ఎక్కించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎక్స్‌ప్రెస్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌కు చెందిన డ్రైవర్లు ఆందోళన దిగారు. అదే సమయంలో ఆమ్నీ బస్ డ్రైవర్లకు, రవాణ సంస్థ బస్ డ్రైవర్లకు మధ్య వాగ్వాదం పెరిగి గొడవకి దారితీసింది. సమాచారం అందుకున్న కీలంబాకం పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఆందోళన చేస్తున్న డ్రైవర్లతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దారు.

వీఐటీలో టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభం

వేలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వీఐటీ యూనివర్శిటీలో దక్షిణ భారత స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. వర్సిటీ ప్రాంగణంలో జరిగిన ప్రారంభోత్సవానికి ఛాన్సలర్ విశ్వనాథన్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తిరువళ్లూర్ యూనివర్శిటీ వీసీ డా.ఆర్ముగం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితాల్లో క్రీడలు ముఖ్య పాత్ర పోషిస్తాయని, క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక, మానసికంగా ఆరోగ్యం మెరుగవుతుందని, క్రీడాకారుల మధ్య స్నేహపూరిత వాతావరణం కూడా బలపడుతుందని తెలిపారు. వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ మాట్లాడుతూ... ఈ పోటీల్లో దక్షిణ రాష్ట్రాలకు చెందిన 103 వర్శిటీల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. జయాపజయాలను ఒకేలా చూడాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో వీఐటీ వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కాదంబరి సీహెచ్ విశ్వనాథన్, ఉప కులపతి, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.




ప్రారంభోత్సవంలో వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్, అతిథులు, పాల్గొన్న క్రీడాకారులు

వేషగాళ్లే మంచి చేస్తారు : పేరరసు



● 'ఎక్స్‌ట్రీమ్' ఆడియో రిలీజ్

సినిమాల్లో వేషాలు వేసేవాళ్ళే (కూత్తాడిగల్) మంచి మాటలు చెబుతారని, మంచి చేస్తారని తమిళ సినీ దర్శకుల సంఘం ప్రధాన కార్యదర్శి, సినీ దర్శకుడు పేరరసు అన్నారు. సీగర్ పిక్చర్స్ పతాకంపై కమలకుమారి, రాజ్‌కుమార్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'ఎక్స్‌ట్రీమ్'. రాజవేల్ కృష్ణ దర్శకుడు. రక్షిత మహాలక్ష్మి, అబినక్షత్ర, ఆనంత్ నాగ్, అమృత హెల్లర్, శివం తదితరులు నటించారు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందించిన ఈ చిత్రం ఈ నెల 20వ తేదీన విడుదలకానుంది. ఈ సినిమా ఆడియో, ట్రైలర్ రిలీజ్ సోమవారం రాత్రి నగరంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పేరరసు, కోలీవుడ్ దర్శకుల సంఘం ఆర్వీ ఉదయకుమార్, సీనియర్ నిర్మాత, నటుడు కె.రాజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పేరరసు మాట్లాడుతూ, 'సినిమా రంగం నుంచి రాజకీయాల్లోకి వస్తే ఎందుకు జీర్ణించుకోలేకపోతున్నారు. ఒకప్పుడు ఎంజీఆర్, కలైంజర్, జయలలిత, విజయ్‌కాంత్ వంటివారంతా వేషగాళ్ళే (కూత్తాడిగల్) అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలి. ఈ వేషగాళ్లే సమాజానికి మంచి చేశారు. కులమతాలను ప్రస్తావించడం ఎంత తప్పో... వేషగాళ్ళు అని చెప్పడం కూడా అంతే తప్పు. రాజకీయ నేతల కంటే సినిమావాళ్ళు ఎంతో మేలు' అని అన్నారు. ఆర్వీ ఉదయకుమార్ మాట్లాడుతూ, 'రాజకీయాల్లోకి వచ్చిన విజయ్‌పై ఇపుడే విమర్శలు చేయడం భావ్యం కాదు. తొలుత రాజకీయాలు చేసిన తర్వాత ఆయనపై విమర్శలు చేయొచ్చు. సినిమా రంగం నుంచి రాజకీయాల్లోకి ఎవరైనా రావొచ్చన్నారు'. కె.రాజన్ మాట్లాడుతూ, 'ఒక చిత్రం బాగుంటే ఆ చిత్ర విజయాన్ని ఏ ఒక్కరూ అడ్డుకోలేరు. మంచి చిత్రాలు తీస్తే మీడియా కూడా అండగా ఉంటుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. చిత్ర దర్శకుడు రాజవేల్ కృష్ణ మాట్లాడుతూ, 'ఇది ఒక మహిళా చిత్రం. ఇందులో ఎలాంటి పొరపాట్లు ఉండరాదని నిర్మాత స్పష్టం చేశారు. అందుకే ఎంతో జాగ్రత్తగా తక్కువ బడ్జెట్‌తో మూవీని పూర్తి చేశాం' అని పేర్కొన్నారు.




కాలర్ ట్యూన్ మార్చుకుంటారు

● జీవీ ప్రకాష్

ఆ స్టార్ హీరో అభిమానులు తమ మొబైల్ ఫోన్స్ కాలర్ ట్యూన్ మార్చుకునే సమయం ఆసన్నమైందని ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ అన్నారు. ఆధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో అగ్రహీరో అజిత్ కుమార్ నటిస్తున్న తాజా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఇందులో అజిత్ మూడు విభిన్న పాత్రలు పోషిస్తున్నారు. త్రిష హీరోయిన్. సునీల్, నస్లేన్, ప్రసన్న, అర్జున్ దాస్, యోగిబాబు తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్నారు. సంగీతం దేవీశ్రీ ప్రసాద్ సమకూర్చుతుండగా, నేపథ్య సంగీతం (బ్యాక్‌రౌండ్ మ్యూజిక్)ను జీవీ ప్రకాష్ కుమార్ అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో అభిమానులతో చిట్‌చాట్ చేసిన జీవీ ప్రకాష్ కుమార్ ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. 'నేను ఇపుడు ఇద్దరు అగ్రహీరోల చిత్రాలకు నేపథ్య సంగీతం అందిస్తున్నాను. ఇందులో ఒక చిత్రంలోని హీరోకు థీమ్ మ్యూజిక్ సమకూర్చాను. ఆ హీరో అభిమానులు తమ మొబైల్ ఫోన్స్ కాలర్ ట్యూన్ మార్చుకునే సమయం ఆసన్నమైంది' అన్నారు. కాగా, జీవీ ప్రకాష్ ఇటీవల సంగీతం అందించిన 'అమరన్', 'లక్కీ భాస్కర్' చిత్రాలు సూపర్‌హిట్ సాధించాయి. ఈ రెండు చిత్రాల్లోని పాటలు కూడా హిట్స్ సాంగ్స్‌గా నిలిచాయి.

హీరోగా సూరికి మరో అవకాశం



కమెడియన్ నుంచి హీరోగా మారిన నటుడు సూరి. వరుస చిత్రాల్లో నటిస్తున్నారు. పైగా తాను నటించిన చిత్రాలన్నీ విజయాన్ని సాధిస్తున్నాయి. దీంతో సూరి హీరోగా సినిమాలు నిర్మించేందుకు నిర్మాతలు ఆసక్తి చూపుతున్నారు. ఈ కోవలోనే 'విడుదలై' పార్ట్-1, పార్ట్-2 చిత్రాలను తీసిన నిర్మాత ఎల్‌రెడ్ కుమార్ మరోమారు హీరోగా సూరికి అవకాశం ఇచ్చారు. 'సెల్ఫీ' తెరకెక్కించిన మదిమారన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనుండగా, జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్ కథ సమకూరుస్తున్నారు. కాగా, 'విడుదలై' చిత్రంలో హీరోగా మారిన సూరి... ఈ నెల 20వ తేదీన విడుదలై 'విడుదలై-2'తో ప్రేక్షకుల ముందుకురానున్నారు. వెట్రిమారన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి ఇళయరాజా సంగీతం అందించారు. ఎల్‌రెడ్ కుమార్, వెట్రిమారన్ కలిసి ఈ సినిమా నిర్మించారు.

చిత్రజ్యోతి

జార్జియాలో 'లెజెండ్'
శరవణన్ సందడి

'లెజెండ్' శరవణన్ చిత్రం జార్జియాలో చిత్రీకరణ జరుపుకుంటుంది. 'గరుడన్' అనే మూవీ తెరకెక్కించిన దురై సెంథిల్ కుమార్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన కొత్త అప్‌డేట్‌ను హీరో శరవణన్ వెల్లడిస్తూ, 'జార్జియాలో షూటింగ్ జరుగుతున్న లొకేషన్ ఫొటోలతో పాటు వీడియో రిలీజ్ చేశారు. రాష్ట్రంలో ప్రముఖ వస్త్ర వ్యాపారి, శరవణా స్టోర్ అధినేత శరవణన్ హీరోగా అవతారమెత్తి నటించిన తొలి చిత్రం 'లెజెండ్'. ఈ చిత్రం ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. అయితే, శరవణన్ పేరు మాత్రం 'లెజెండ్' శరవణన్‌గా మారిపోయింది. ఈ నేపథ్యంలో తన రెండో చిత్రాన్ని దురై సెంథిల్ కుమార్ దర్శకత్వంలో ప్రారంభించారు. చెన్నై, తూత్తుక్కుడి, ఉత్తరభారతంలోని కొన్ని ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకున్న ఈ చిత్రం ప్రస్తుతం జార్జియాలో కొన్ని భారీ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ షూటింగ్ ఫొటోలను హీరో సోషల్ మీడియాలో షేర్ చేశారు. నిర్మాణ పనులన్నీ త్వరగా పూర్తి చేసి వచ్చే యేడాది ఏప్రిల్‌లో విడుదల చేయాలని భావిస్తున్నారు. యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్నారు.



'లెజెండ్' శరవణన్ బృందం


'టంగ్‌స్టన్'కు వ్యతిరేకంగా
నెడువాసల్ తరహా ఉద్యమం?

● జీవ వైవిధ్య వారసత్వ ప్రదేశానికి ముప్పు
● పోరుబాటలో 50కి పైగా గ్రామాల ప్రజలు



అరిట్టాపట్టి కొండ వద్ద వాగు

టి.నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంతటా పచ్చదనం... ఎటుచూసినా అందమైన కొండలు, కోనలు, అరుదైన పక్షుల కిలకిలారావాలు, కాల్వలో పారుతున్న నీటి శబ్దాలు, పచ్చటి చెట్లు, కనుచూపు మేర పొలాలు, మూడువైపులా యానైమలై, పెరుమాళ్‌మలై, అళగర్‌మలై ఇలా మూడు దేవతామూర్తులు కొలువైన పర్వతాలు.. ప్రకృతిమాత తన అందాన్నంతా ఆరబోసిన ప్రాంతంగా అరిట్టాపట్టి గ్రామం అందరినీ ఆకట్టుకుంటోంది. ప్రశాంత జీవనం సాగే ఆ అరిట్టాపట్టి గ్రామస్థులతోపాటు ఆ గ్రామం పరిసరాల్లోని 50కి పైగా గ్రామాల ప్రజలకు రెండు మాసాలుగా కంటిపై కునుకు లేదు. తమ తాత ముత్తాతల కాలం నుంచి ప్రకృతి



టంగ్‌స్టన్ తవ్వకాలకు ఎంపికైన ప్రాంతం

ఒడిలో సేదతీరుతూ, ముక్కారు పంటలను పండిస్తున్న తమ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందనే భయాందోళన ప్రతి ఒక్కరి ముఖంలో కనబడుతోంది. తమ గ్రామాలచుట్టూ రక్షణ కవచాలుగా ఉన్న కొండలన్నీ పేకముక్కలా తమ కళ్లెదుటే రాలిపోతాయోననే భయమూ కనిపిస్తోంది. దీనికి కారణం కేంద్ర ప్రభుత్వం అనుమతించిన టంగ్‌స్టన్ తవ్వకాల ప్రాజెక్టు. అందులోనూ ఈ తవ్వకాలు చేపట్టేంది స్టెరిలైట్ కర్మాగారాన్ని నడిపిన వేదాంతా గ్రూపు అనుబంధ సంస్థ హిందూస్థాన్ జింక్ అని తెలియటంతో మరింత భయాందోళన చెందుతున్నారు.

అరుదైన జంతువులు, పక్షుల స్థావరం...

ప్రపంచంలోనే అంతరించిపోతున్న, అరుదైన పక్షులుగా భావించే రాజాళి గద్దలు, లకుడు అనే పలు మైళ్లదూరం వరకు ఎగురుతూ ఎర వెదికే అరుదైన వాలూరు గద్దలు అంతరించిపోయినట్లు చెబుతున్నా, ఆ అరుదైన పక్షిరాజుల నివాసం అరిట్టాపట్టి ప్రాంతమేనని చెప్పటం అతిశయోక్తికాదు. అంతే కాదు 280 రకాలకు చెందిన పక్షులు, అరుదైన దేవాంగ పిల్లులు, చీమలు తినే జంతువులు, కొండ చిలువలు, 700ల రకాలకు పైగా సరీసృపాలు ఈ పర్వతం



అరిట్టాపట్టి కొండల్లో తిరిగే రాజాళి గద్ద



అరుదైన పక్షులు, గద్దలు నివసించే కొండలు

లోనే నివసిస్తున్నాయి. అందుకనే అరిట్టాపట్టిని జీవ వైవిధ్య వారసత్వ ప్రదేశంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

క్రీస్తుపూర్వం చరిత్రకు సాక్ష్యాలు...

ఇదిలా ఉంటే 2200 సంవత్సరాల క్రితం శిలాశాసనాలు, జైనుల స్థావరాలు, సంగ కాలపు రాతిపలకలు, గుహాలయాలు ఇలా తమిళుల ప్రాచీన చారిత్రక విశేషాలను ఎలుగెత్తి చాటుతున్నాయి. ముల్లైపెరియార్ డ్యామ్ నుండి విడుదలయ్యే జలాల ద్వారా ఈ ప్రాంతంలో 25 వేల హెక్టార్లలో పంటలు వేస్తున్నారు. యేడాదిపొడవునా మూడు భోగాల పంటలు పండే ప్రాంతాలివి. అంతే కాదు దేశంలో అత్యంత తీపి చెరకు పండే ప్రాంతం కూడా ఇదే. తమిళ సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించే అరుదైన క్షేత్రాలుగా ఈ అరిట్టాపట్టి, దాని చుట్టూ ఉన్న తెర్కుతెరు, ముత్తువేల్‌పట్టి, కున్నిపట్టి, కిడారిపట్టి, ఎట్టిమంగళం, వెళ్లయ్‌పట్టి, సిలిప్పియపట్టి, చెట్టియార్‌పట్టి, నాయ్‌క్కారపట్టి, రెడ్డియార్‌పట్టి, షణ్ముగనాథపురం అనే పదికిపైగా గ్రామాలు పేరుగడించాయి. ఈ గ్రామాల ప్రజలకు, ప్రత్యేకించి ముక్కారు పంటలు పండించే అన్నదాతలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన టంగ్‌స్టన్ తవ్వకాల ప్రకటన కంటిమీద కునుకులేకుండా చేసింది. కేంద్ర సొరంగాల శాఖ ఆధ్వర్యంలో మేలూరు తాలూకాలో అరిట్టాపట్టి చుట్టుపక్కల గ్రామాల్లో టంగ్‌స్టన్ నిక్షేపాలు అధికంగా ఉన్న ప్రాంతాలను హిందూస్థాన్ జింక్ దక్కించుకుంది. ఆ సంస్థ ఆ ప్రాంతంలో తవ్వకాలు జరిపేందుకు సన్నాహాలు కూడా ప్రారంభించింది. అరి



అరిట్టాపట్టికి వెళ్లే మార్గంలో ఆనైమలై

టాపట్టి పరిసర ప్రాంతాల్లో టంగ్‌స్టన్ తవ్వకాలకు హిందూస్థాన్ జింక్ సంస్థకు అనుమతివ్వనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర సొరంగాల శాఖ అనుమతించిన 2015.51 హెక్టార్లలో అరిట్టాపట్టి ప్రాంతం కూడా ఒకటి. ఈ అరిట్టాపట్టి ఉన్న మేలూరు తాలూకాలోని నాయక్కారపట్టి బ్లాక్ 5000 ఎకరాల విస్తీర్ణంలో టంగ్‌స్టన్ ఖనిజనిక్షేపాలున్న ప్రాంతాన్ని సొరంగం తవ్వకునేందుకుగాను వివాదాస్పద వేదాంతా గ్రూపు అనుబంధంగా ఉన్న హిందూస్థాన్ జింక్ వేలంలో దక్కించుకుందని తెలియటంతో అరిట్టాపట్టి ప్రజలంతా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.



ఏడో శతాబ్దం నాటి లగులీశర్ పరమశివుడి గుహాలయం

ముక్కారు పంటలు పండే సీమ...

అంతర్జాతీయ మార్కెట్‌లో విలువకట్టడానికి కూడా వీలు లేని టంగ్‌స్టన్ నిక్షేపాలకు ప్రపంచ వ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. మేలూరు తాలూకాలో 5000 ఎకరాలకు పైగా అత్యంత విలువైన టంగ్‌స్టన్ నిక్షేపాలున్నట్లు గుర్తించిన హిందూస్థాన్ జింక్ సంస్థ వాటిని తవ్వితీసేందుకు సమాయత్తమవుతోంది. ఈ ప్రాంతంలోనే 72 చెరువులు, 200లకు పైగా నీటిబుగ్గలు, సరస్సులు, మూడు చెక్‌డ్యామ్‌ల ద్వారా పంటభూములను సాగుజలాలు అందుతున్నాయి.



తమిళ శిలాశాసనాలు, తీర్థంకరుడి విగ్రహం ఉన్న ప్రాంతానికి దారి

జైనుల స్థావరాలు, గుహాలయాలు...

ఈ ప్రాంతంలోనే 2200 యేళ్లనాటి తమిళ అక్షరాలకు సంబంధించిన శిలాశాసనాలు కూడా ఉన్నాయి. జైనుల స్థావరాలు, గుహాలయాలు కూడా ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయి. అరిట్టాపట్టిలో పంట పొలాల నడుమనున్న శివాలయం 13వ శతాబ్దం నాటిదని పురావస్తు పరిశోధకులు చెబుతున్నారు. ఆ చోట శివలింగం అడుగు భాగం మాత్రమే ఉంది. విక్రమపాండ్యన్ కాలం నాటి శిలాశాసనమూ ఉంది. యెన్నో శతాబ్దాల నాటి మహావీరుడి శిల్పం, జైనుల స్థావరాలు, గుహాలయాలు కూడా ఈ ప్రాంతంలోనే ప్రాచీన చరిత్రకు సాక్ష్యం చెబుతున్నాయి. అరిట్టాపట్టి చుట్టూరా ఓ వైపు ఆనైమలై, పెరుమాళ్‌మలై, మరో వైపున అళగర్ మలై అంటూ ప్రధాన దేవతామూర్తులు కొలువుదీరి ఉన్నారు. ప్రకృతి సౌందర్యాలతో కూడుకున్న, తమిళ



టంగ్‌స్టన్ ప్రాజెక్టుపై చర్చించేందుకు వచ్చిన గ్రామస్తులు

ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలను పెంచి పోషిస్తున్న ఈ ప్రాంతంలో టంగ్‌స్టన్ సొరంగ తవ్వకాలు జరుగకుండా రాష్ట్ర ప్రభుత్వమే తమను కాపాడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారనటం కంటే వేడుకుంటున్నారని చెప్పటం సమంజసం. ఇదివరకే మేలూరులో చాలా భాగం గ్రానైట్ కోసం తవ్వకాలు జరిపారని, అన్ని గ్రామాల వారు సమైక్య ఉద్యమం జరుపటంతో ఆ తవ్వకాలు ఆగిపోయాయని స్థానికులు తెలిపారు. ఈ నేపథ్యంలో టంగ్‌స్టన్ తవ్వకాలకు కేంద్రం అనుమతించిందనే వార్త తమ గుండెల్లో గునపాలు దింపినంత బాధలను కలిగించిందని స్థానికులు వాపోయారు. టంగ్‌స్టన్ తవ్వకాలు జరిగితే కొండలు, వ్యవసాయ భూములు నాశనమై తమకు జీవనోపాధి లేక ఇతర ప్రాంతాలకు వలసపోవలసి వస్తుందని భీతిల్లుతున్నారు.



ధర్నాచేస్తున్న అరిట్టాపట్టి, పరిసర గ్రామాల రైతులు

నెడువాసల్ తరహా ఆందోళనలా?

కొన్నేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వ అధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించినప్పుడు తామంతా వ్యతిరేకించామని, అయితే తాము పరిశీలిస్తున్నది ఖనిజాల తవ్వకాల కోసం కాదని, ఈ ప్రాంతంలో ఎలాంటి ఖనిజాలున్నాయో తెలుసుకోవడానికేనంటూ మాయమాటలు చెప్పి వెళ్ళిపోయారని స్థానికులు వివరించారు. తూత్తుకుడిలో స్టెరిలైట్ కాపర్ కర్మాగారాన్ని వ్యతిరేకిస్తూ జరిపిన ఉద్యమం లాగే అరిటాపట్టి ప్రాంతాన్ని కాపాడేందుకు అంతటి తీవ్రమైన ఆందోళన చేయాల్సి వస్తుందేమోనని తామంతా భీతిల్లుతున్నామని రైతులు తెలిపారు. ఈ ప్రాంతంలో టంగ్‌స్టన్ తవ్వకాలకుగాను హిందూస్థాన్ జింక్ సంస్థకు ఇచ్చిన అనుమతిని కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని, లేకుంటే నెడువాసల్, స్టెరిలైట్ తరహా ఉద్యమాలకు దిగుతామని హెచ్చరించారు. తాము చేపట్టబోయే ఆందోళన 2017లో నెడువాసల్ వద్ద హైడ్రోకార్బన్ ముడిచమురు తవ్వకాలకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనగా రూపుదిద్దుకున్నా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదని ఆ గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం టంగ్‌స్టన్ తవ్వకాల ప్రాజెక్టును పూర్తిగా రద్దు చేయాలని లేకుంటే తీవ్ర స్థాయిలో ఉద్యమం చేపట్టక తప్పదని అరిట్టాపట్టి పరిసర గ్రామాల ప్రజలు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఈ ప్రాజెక్టును అడ్డుకునేలా ప్రత్యేక తీర్మానం చేసి ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపటంతో గ్రామస్థులంతా కాస్త ఊరట చెందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం టంగ్‌స్టన్ తవ్వకాల ప్రాజెక్టు అమలుకు హిందూస్థాన్ జింక్ సంస్థకు ఇచ్చిన అనుమతిని రద్దు చేసి, ఎప్పుడు అధికారికంగా ప్రకటిస్తుందా అని ఎదురుచూస్తున్నారు.



అరిట్టాపట్టిని ఇటీవల పరిశీలించిన రైతు సంఘాల సమాఖ్య నేతలు పీఆర్ పాండ్యన్ తదితరులు

ఏడుకొండల ప్రాంతం...

ఎన్నో సాహితీ, సాంస్కృతిక సంఘాల ద్వారా తమిళ భాష, సాహిత్యాన్ని పెంచి పోషించిన మదురై జిల్లా పలు విశిష్టతలతో విరాజిల్లుతోంది. తమిళ సంస్కృతి, సంప్రదాయాలకు నెలవైన మదురై జిల్లావాసుల గుండెల్లో ప్రస్తుతం రైళ్లు పరుగెడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం టంగ్‌స్టన్ ప్రాజెక్టు అనుమతించిందన్న పిడుగులాంటి వార్త విన్నప్పటి నుండి ఆ జిల్లా వాసులు భయపడుతున్నారు. మదురై జిల్లా మేలూరు యూనియన్‌కు చెందిన అరిట్టాపట్టి, మదురై తూర్పు యూనియన్ పరిధిలోని మీనాక్షిపురం తదితర గ్రామాలు సహా 19.3215 హెక్టార్ల విస్తీర్ణం ఉన్న ప్రాంతాలను 2022 నవంబర్‌లో జీవవైవిధ్య వారసత్వ ప్రదేశం (బయోడైవర్సిటీ హెరిటేజ్ సైట్)గా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలోనే మొదటి జీవవైవిధ్య వారసత్వ స్థలంగా ఉన్న ఈ ప్రాంతాల్లో కళుగుమలై, కళింజమలై, నాట్టార్‌మలై, రామాయిమలై, ఆప్తాన్‌మలై, తేన్‌కూడు మలై, గుహైకందిమలై అనే ఏడు పర్వతాలున్నాయి.



తొలి భారత గవర్నర్ జనరల్, మాజీ ముఖ్యమంత్రి చక్రవర్తి రాజగోపాలాచారి 146వ జయంతి సందర్భంగా గిండి రాజ్‌భవన్‌లో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవి



చెన్నై హైకోర్టు ప్రాంగణం వద్ద తొలి భారత గవర్నర్‌జనరల్, మాజీముఖ్యమంత్రి చక్రవర్తి రాజగోపాలాచారి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు ఎం. సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, మేయర్ ఆర్ ప్రియా, పౌరసంబంధాల శాఖ సంచాలకుడు డా. వైద్యనాథన్ సమాచార పౌరసంబంధాల శాఖ అదనపు సంచాలకులు ఎంపీ అన్బుచోళన్, ఎస్. సెల్వరాజ్ తదితరులు

క్యాన్సర్ బాధితులకు క్రికెట్ పోటీలు

చెన్నై, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వార్‌పేటలోని కావేరి హాస్పిటల్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌కు గురై కోలుకున్నవారిలో ఆత్మస్థైర్యం నింపేలా బౌల్ అవుట్ క్యాన్సర్ -2024 పేరుతో మంగళవారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల ప్రారంభోత్సవానికి సినీనటుడు హరీష్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కావేరి హాస్పిటల్ సిబ్బంది, క్యాన్సర్ నుంచి కోలుకున్న వారి మధ్య ఈ క్రికెట్ పోటీలు ఆద్యంతం ఆసక్తికరంగా కొనసాగినట్లు హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అయప్పన్ పొన్నుసామి తెలిపారు. ఈ పోటీల్లో క్యాన్సర్ నుండి కోలుకున్నవారంతా ఉత్సాహంగా క్రికెట్ ఆడుతుండటం తనకెంతో ఆనందాన్ని కలిగించిందని కావేరి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్ తెలిపారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.మహేష్‌కుమార్, సీనియర్ అంకాలజిస్ట్ డాక్టర్ సుజయ్ సుశికర్ తతదితరులు పాల్గొన్నారు.



నటుడు హరీష్ కళ్యాణ్‌ను ఆహ్వానిస్తున్న ఆస్పత్రి నిర్వాహకులు

స్టార్ హెల్త్ నుంచి సరికొత్త పాలసీ
'సూపర్‌స్టార్'



ఆనంద్ రాయ్

అడయార్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఉన్న ప్రైవేటు ఆరోగ్య బీమా కంపెనీల్లో ఒకటైన స్టార్ హెల్త్ నుంచి సరికొత్త హెల్త్ పాలసీని ప్రవేశపెట్టారు. 'సూపర్‌స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ అనే పేరుతో ప్రవేశపెట్టిన ఈ బీమా పాలసీని ఆ కంపెనీ సీఎండీ ఆనంద్ రాయ్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియయా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తమ కంపెనీ రాష్ట్రంలో బలమైనదిగా ఉందని, గడిచిన ఐదేళ్లలో రూ.3,470 కోట్ల వ్యాపారం, 115 శాఖలు, 2,000కు పైగా ఆస్పత్రులతో విస్తృతమైన నెట్‌వర్క్ కలిగి ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో తమ కంపెనీ నుంచి 'సూపర్‌స్టార్' పేరుతో సరికొత్త పాలసీని ప్రవేశపెట్టామన్నారు. ఈ పాలసీ తమ కస్టమర్ల డైనమిక్ హెల్త్‌కేర్ అవసరాలను తీరుస్తుందన్నారు. ఈ పాలసీ ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనాలను పొందవచ్చన్నారు. సూపర్‌స్టార్ బోనస్, అపరిమిత మొత్తం బోనస్, ప్రీమియం మినహాయింపు, ఈ-ఇంటర్నేషనల్ మెడికల్ ఒపీనియన్ తదితర అంశాలు ఇందులో ఉన్నాయన్నారు.



దర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 16 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచివున్నారు.

హుండీ(ఆదివారం నాటిది) ద్వారా: రూ.3.77 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 67,124

తలనీలాలు సమర్పించిన వారు: 24,069

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఏడు గంగమ్మల ఫైల్ ఫోటోలు

శ్రీకాళహస్తి స్పెషల్

ఏడు గంగమ్మల జాతర

గ్రామ దేవతలకు ఏటి ఉత్సవాన్ని జాతర మహోత్సవంగా నిర్వహించడం మన సంప్రదాయంలో ఒక భాగం. తమను గంగమ్మతల్లి చల్లంగా చూడాలన్న సంకల్పంతో జాతరను వైభవంగా నిర్వహిస్తారు. అమ్మకు అంబళ్ల పోయడమే కాకుండా వేషధారణలతో పాటు ఊరేగింపులు, పొంగళ్లతో పాటు జంతుబలులు నైవేద్యంగా సమర్పిస్తుంటారు. జిల్లా అంతటా వేసవిలోనే గంగ జాతరలు జరుగుతున్నాయి. అందునా ఒకే గంగమ్మను కొలువుదీర్చి మొక్కులు చెల్లించుకుంటారు. కానీ, జాతర విషయంలో శ్రీకాళహస్తికి ప్రత్యేకత ఉంది. ఇక్కడా ఒకేరోజు.. ఏడు గంగమ్మలను కొలువుదీర్చి జాతర నిర్వహిస్తారు. డిసెంబరు నెలలో.. చలికాలంలో జాతర నిర్వహించడం ఇక్కడి స్పెషాలిటీ. ఏడుగంగమ్మలైన అక్కా చెల్లెళ్లు శ్రీకాళహస్తిలో స్వయంభువుగా వెలిశారని పురాణగాథలు ప్రచారంలో ఉన్నాయి. వందలాది సంవత్సరాలుగా శ్రీకాళహస్తిలో ఏడు గంగల పండుగ నిర్వహిస్తున్నారు. చరిత్రాత్మకంగా పరిశీలిస్తే.. జమిందారులు, సంస్థానాదీశుల సమయంలో శ్రీకాళహస్తి గ్రామానికి ఏడువైపులా గంగరాళ్లు (తెట్టురాళ్లు) ఏర్పాటు చేశారని పెద్దలు చెబుతారు. ఆయా గంగమ్మల వద్ద ఆయా ప్రాంతాల్లో ఏటా అమ్మవార్లను కొలువుదీర్చడం.. ఒకేరోజు, ఒకేసారి ఊరేగింపు, నిమజ్జనం జరగడం తరతరాలుగా వస్తోంది. మరెక్కడా లేని విధంగా ఒకేసారి ఏడు గంగమ్మలకు జరిగే జాతర రెండు తెలుగు రాష్ట్రాల్లోనే ఎంతో ప్రత్యేకతను సంతరించుకుంది. శ్రీకాళహస్తిలో బుధవారం గంగజాతర వైభవోపేతంగా జరగనుంది. మంగళవారం రాత్రి అమ్మవార్లకు ఏడు గంగమ్మల ఆలయం వద్ద పూజలు నిర్వహించాక ముసుగు తొలగిస్తారు. బుధవారం వేకువజామున భక్తులకు దర్శనభాగ్యం కల్పించాక.. పెండ్లిమండపం వరకు ఏడుగంగమ్మలు ఒకరి వెనుక ఒకరుగా ఊరేగింపుగా వస్తారు. అక్కడ్నుంచి ఆయా ప్రాంతాలకు అమ్మవార్లను తీసుకొస్తారు. ఉదయం 9గంటల నుంచి భక్తులు ఏడు గంగమ్మలకు మొక్కులు చెల్లించుకుంటారు. మళ్లీ రాత్రికి ఏడుగురు అమ్మవార్లను ముత్యాలమ్మ ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చి.. ఒక్కొక్కరికి వరుసగా ప్రత్యేక పూజలతో నిమజ్జన కార్యక్రమం చేయడంతో జాతర ముగుస్తుంది.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



పెండ్లిమండపం గంగమ్మ పాతచిత్రం



గాంధీవీధి గంగమ్మ తెట్టురాయి

అమ్మవార్లు కొలువుదీరేది ఇక్కడే

మొదటి గంగమ్మ పెండ్లిమండపం వద్ద పొన్నాలమ్మగా కొలువుదీరతారు వరసగా.. బాబుఅగ్రహారం వద్ద అంకాళమ్మ, కొత్తపేట వద్ద భువనేశ్వరిగా, సన్నిధివీధిలో అంకమ్మగా, తేరువీధిలో నల్లగంగమ్మగా, జయరామరావువీధిలో కావమ్మగా, బేరివారి మండపం వద్ద ముత్యాలమ్మగా గంగమ్మలను ఆరాధిస్తారు.



పర్యాటకంలో తిరుపతికి ప్రాధాన్యం



తిరుపతి కేంద్రంగా పరిసర ప్రాంతాల అభివృద్ధి

యాంకర్ హబ్ కింద తిరుపతి కేంద్రంగా చుట్టుపక్కల ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని ఏ మూల నుంచైనా సులువుగా జిల్లాలోని పర్యాటక గమ్య స్థానాలను చేరుకునేలా రోడ్డు, రైలు, విమాన ప్రయాణాలకు వీలు కల్పించనుంది. సామాన్య యాత్రికులను దృష్టిలో వుంచుకుని షటిల్ బస్సులు, రెంటల్ బైక్‌లు వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించనుంది. పర్యాటక గమ్యస్థానాలు చేరే క్రమంలో మార్గాల వెంబడీ పార్కింగ్ లాట్స్, పరిశుభ్రమైన రెస్ట్ రూమ్స్, తాగునీరు, స్పష్టమైన సూచిక బోర్డులు వంటి సదుపాయాలు ఏర్పాటు చేయనుంది. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ కింద హైవే నిర్మాణాలు, హోటళ్లు, ఆధునిక రవాణా సదుపాయాలు వంటివి కల్పించనుంది. మరోవైపు పర్యాటక రంగం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ఆసక్తి ఉన్న యువతకు ఆతిథ్య రంగంలోనూ, హస్త కళలలోనూ, టూర్ ఆపరేషన్లలో శిక్షణ ఇవ్వనుంది.

● 2024-29 టూరిజం పాలసీ విడుదల చేసిన ప్రభుత్వం

పర్యాటకంలో జిల్లాకు, తిరుపతి నగరానికి ప్రాధాన్యం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల కాలానికిగాను (2024-29) మంగళవారం ఏపీ టూరిజం పాలసీని విడుదల చేసింది. ఇందులో ఏడు యాంకర్ హబ్‌గా తిరుపతిని గుర్తించారు. టెంపుల్ టూరిజం సర్క్యూట్, సీ ప్లేన్ డెస్టినేషన్లలోనూ చోటు దక్కించుకుంది. కలంకారీ చిత్రకళకు, ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్, ఏపీ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ సంస్థలకు ప్రత్యేక గుర్తింపు లభించింది. కాకుంటే, టెంపుల్ సర్క్యూట్‌లలో శ్రీకాళహస్తికి, బీచ్.. ఎకో టూరిజం సర్క్యూట్లలో జిల్లాకు మొండిచేయి చూపించింది. ఈ విషయంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధుల వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

నూతన టూరిజం పాలసీలో రాష్ట్రంలో ఏడు యాంకర్ హబ్‌లను ప్రభుత్వం గుర్తించింది. ఈ జాబితాలో విశాఖపట్నం, అరకులోయ, శ్రీశైలం, గండికోట, రాజమహేంద్రవరం, అమరావతితో పాటు తిరుపతికీ చోటు లభించింది. వీటిలో తిరుపతి, అరకులోయ ప్రాంతాలను స్వల్ప, మధ్యకాలిక ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. జిల్లాను ప్రధాన పర్యాటక గమ్యస్థానాలుగా గుర్తించిన ప్రభుత్వం ఇక్కడ ఒకే రంగానికి పరిమితం కాకుండా యాత్రికులకు వైవిధ్యభరిత అనుభవాన్నిచ్చేలా చర్యలు తీసుకుంటోంది. దీంతో పాటు మైస్ టూరిజం (మీటింగ్స్, ఇన్సెంటివ్స్, కాన్ఫరెన్సెస్ అండ్ ఎగ్జిబిషన్స్) పరంగానూ తిరుపతిని అభివృద్ధి పరచాలని నిర్ణయించింది.

టెంపుల్ సర్క్యూట్.. సీ ప్లేన్ డెస్టినేషన్లలో స్థానం

రాష్ట్ర వ్యాప్తంగా గుర్తించిన పది టెంపుల్ టూరిజం సర్క్యూట్లలో తిరుపతికి స్థానం లభించింది. ముఖ్యంగా ఆలయాలున్న ప్రాంతాల అభివృద్ధికి డీటైల్డ్ మాస్టర్ ప్లాన్ రూపొందించనుంది. ఏడాది పొడవునా ఆయా ప్రాంతాల్లో ఉత్సవాలు, వేడుకలు నిర్వహించేందుకు వీలుగా క్యాలెండర్ రూపొందించనుంది. దీనివల్ల ఆ ప్రాంత ప్రత్యేకత రాష్ట్రవ్యాప్తంగా తెలిసే అవకాశముంది. ఇక, రాష్ట్రవ్యాప్తంగా సీ ప్లేన్ డెస్టినేషన్లుగా ప్రభుత్వం గుర్తించిన ఎనిమిది ప్రదేశాల్లో తిరుపతి కూడా ఉండటం విశేషం. అయితే విశాఖపట్నం, కాకినాడ వంటి చోట్ల నుంచీ సీ ప్లేన్ సర్వీసులను జిల్లాలో ఎక్కడికి నడపతారనే దానిపై పాలసీలో స్పష్టత ఇవ్వలేదు.



కలంకారీ సావనీర్ షాపులు

హస్త కళలకు ప్రాచుర్యం కల్పించడంలో భాగంగా సావనీర్ షాపులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అలాగే ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ టూరిజం కింద వర్క్‌షాపులు, ఎగ్జిబిషన్లు నిర్వహించనుంది. ఇందులో భాగంగా ఎంపిక చేసిన హస్త కళల జాబితాలో శ్రీకాళహస్తికి చెందిన కలంకారీ పెయింటింగ్స్‌కు చోటు దక్కింది. ఇప్పటికే ప్రాచుర్యం కలిగిన కలంకారీ చిత్రకళకు తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మరింత ప్రచారాన్ని తెచ్చి పెట్టనుంది.

కలినరీ, హోటల్ మేనేజ్‌మెంట్ సంస్థలకు ప్రాధాన్యం

పర్యాటక విధానంలో ఫుడ్ ఫెస్టివల్స్‌కు ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది. ఆయా ప్రాంతాలకు ప్రత్యేకమైన ఆహార పదార్థాలు, వంటలను అందరికీ పరిచయం చేయనుంది. ఆ బాధ్యతను తిరుపతిలోని కేంద్ర పర్యాటక శాఖకు చెందిన ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్, రాష్ట్ర పర్యాటక శాఖకు చెందిన స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్‌పై పెట్టాలని భావిస్తోంది. వీటి ద్వారా ఏడాది పొడవునా ఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహించడం, వేర్వేరు స్థాయిల హోటళ్ల నడుమ పోటీలు నిర్వహించడం, విజేతలకు బహుమతులు అందజేసి ప్రోత్సహించాలని నిర్ణయించింది. ఆసక్తి కలిగిన యువతకు అవసరమైన శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేయనుంది.



నేడు భారతీయార్‌కు సీఎం నివాళి

ఐసిఎఫ్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహాకవి భారతీయార్ 143వ జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి ముఖ్యమంత్రి స్టాలిన్ నివాళులర్పించనున్నారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... మెరీనా బీచ్ సమీపంలోని భారతీయర్ విగ్రహానికి బుధవారం ఉదయం సీఎం నివాళులర్పించనున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, జీసీసీ మేయర్, డిప్యూటీ మేయర్ సహా పార్టీ కార్యకర్తలు హాజరుకానున్నారు.

ఎక్స్‌ప్రెస్‌గా చెన్నై-మైసూరు రైలు

ఐసిఎఫ్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చెన్నై-మైసూరు మధ్య నడుపుతున్న సూపర్‌ఫాస్ట్ రైలు ఇకనుంచి సాధారణ ఎక్స్‌ప్రెస్‌గా నడువనుంది. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... చెన్నై-మైసూరు మధ్య నడుస్తున్న సూపర్ ఫాస్ట్ రైలులో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజలు అధికంగా ప్రయాణిస్తున్నారు. ఈ రైలు మొత్తం 23 స్టేషన్ల ఆగి వెళుతుంది. సాధారణ రైలుగా మారడం ద్వారా టిక్కెట్టు ధర రూ.15 నుంచి రూ.45 వరకు తగ్గనుంది. అలాగే, సీజన్ పాస్ రాణిపేట, వేలూరు, తిరుపత్తూర్ ప్రాంతాల ప్రజలకు రూ.150 వరకు తగ్గనున్నట్లు అధికారులు తెలిపారు.

కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల ఆందోళన

ఐసిఎఫ్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తమ ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని కోరుతూ కాంటాక్ట్ ఉపాధ్యాయులు మంగళవారం నగరంలో ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో దీర్ఘకాలంగా కాంటాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమను పర్మినెంట్ చేయాలని కోరుతూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. గత ఎన్నికల ప్రచారంలో కూడా అప్పటి ప్రతిపక్ష నేత స్టాలిన్, తాము అధికారంలోకి వస్తే ఉద్యోగాలు పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అధికారం చేపట్టి మూడున్నరేళ్లు దాటినా తమ సమస్య పరిష్కరించకపోవడంతో, ఉపాధ్యాయులు పలురకాలుగా ఆందోళన చేపట్టారు. తాజాగా, కాంటాక్ట్ ఉపాధ్యాయుల సమాఖ్య సచివాలయం ముట్టడికి పిలుపునిచ్చింది. ఆ మేరకు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి సుమారు 5 వేల మంది ఉపాధ్యాయులు నగరానికి చేరుకున్నారు. ఎగ్మూర్ రాజారత్నం స్టేడియం ముందు చేరిన ఉపాధ్యాయులు, సచివాలయానికి ర్యాలీగా బయల్దేరారు. అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. ఆ సమయంలో పోలీసులు, ఉపాధ్యాయుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం ఉపాధ్యాయులను అరెస్ట్ చేసిన పోలీసులు, వారిని రాజారత్నం మైదానానికి తరలించారు. కాగా, ఉపాధ్యాయుల అరెస్ట్‌పై అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ సహా పలు పార్టీల నేతలు ఖండించారు.

ఆమ్నీ బస్సును ఢీకొన్న లారీ

● 10 మందికి గాయాలు



చెన్నై, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీపెరుంబుదూరు సమీపంలో మంగళవారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో పది మంది గాయపడ్డారు. చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిలో వెళ్తున్న ఆమ్నీ బస్సు ఓ మలుపు వద్ద యూటర్న్ చేస్తుండగా వెనుకనే వచ్చిన లారీ ఢీకొన్నది. దీంతో ఆ బస్సు రోడ్డుపై బోల్తాపడి ధ్వంసమైంది. ఈ సంఘటనలో 9మంది ప్రయాణికులు, రహదారిపై నడిచి వెళుతున్న ఓ వ్యక్తి గాయపడ్డారు. అందరినీ చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు మధ్యలో గుంత... ట్రాఫిక్ రద్దీ

ఐసిఎఫ్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక చిన్న పోరూర్ మెయిన్ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. రామాపురం-పోరూర్ మధ్య మంగళవారం ఉదయం 10 గంటలకు రద్దీ అధికంగా ఉన్న సమయంలో, హఠాత్తుగా రోడ్డు మధ్యలో పెద్ద గొయ్యి ఏర్పడింది. ఆ గొయ్యి నుంచి నీరు రోడ్డుపై ప్రవహించడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకొని గొయ్యిని పూడ్చే పనులు చేపట్టారు.



తన జన్మదినం సందర్భంగా సచివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలుసుకున్న శాసనసభ డిప్యూటీ స్పీకర్ పిచ్చాండి

విష జ్వరానికి 9 నెలల బాలుడి మృతి

ఐసిఎఫ్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విష జ్వరంతో బాధపడుతున్న 9 నెలల బాలుడు మృతిచెందాడు. మధురవాయల్ ఆలపాక్కం మెయిన్ రోడ్డుకు చెందిన అరుణ్‌ప్రశాంత్ కుమారుడు అఖిలన్ (9 నెలలు) గత వారం రోజులుగా జ్వరం లక్షణాలతో బాధపడుతుండగా, తల్లిదండ్రులు అదే ప్రాంతంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స ఇచ్చారు. కానీ, జ్వరం తగ్గకపోవడంతో పోరూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సలు ఫలించక అఖిలన్ మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతికి గల కారణాలపై విచారిస్తున్నారు.

శ్రీలంక జైలు నుంచి తమిళ జాలర్ల విడుదల

ప్యారీస్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నావికాధళం అరెస్టు చేసిన 21 మంది తమిళ జాలర్లు శ్రీలంక జైలు నుంచి స్వదేశానికి తిరిగి వచ్చారు. రామనాథపురం జిల్లా రామేశ్వరం ఫిషింగ్ హార్బర్ నుంచి మూడు మర పడవల్లో గత నెల తొమ్మిదో తేదీ వేటకు వెళ్లిన 21 మంది జాలర్లను దేశ సముద్ర సరిహద్దులు దాటారంటూ శ్రీలంక నావికా ధళం అరెస్ట్ చేసి జైలుకి తరలించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమిళ జాలర్ల విడుదల కోరుతూ చేపట్టిన ప్రయత్నాలు ఫలించడంతో శ్రీలంక ప్రభుత్వం జాలర్లను జైలు నించి విడుదల చేయించింది. దీంతో తమిళ జాలర్లు కొలంబో విమానాశ్రయం నుంచి సోమవారం రాత్రి చెన్నైకి తిరిగొచ్చారు. వారిని మంగళవారం ఉదయం ప్రత్యేక వాహనాల ద్వారా రాష్ట్ర మత్స్య శాఖ అధికారులు రామేశ్వరానికి సాగనంపారు.



తిరిగొచ్చిన జాలర్లు

సీబీఐ విచారణకు సిద్ధమేనా?

● విద్యుత్ బోర్డ్ అవినీతిపై పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి సవాల్

ప్యారీస్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు విద్యుత్ బోర్డు (టీఎన్ఈబీ)లో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణకు సిద్ధమేనా అని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాష్ట్ర ప్రభుత్వానికి సవాల్ విసిరారు. భారత సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి సౌర విద్యుత్ కొనుగోలు చేసేందుకు టీఎన్ఈబీకి ఆదానీ సంస్థ ముడుపులు చెల్లించినట్లు అమెరికా కోర్టులో దాఖలైన కేసుపై రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని అన్బుమణి డిమాండ్ చేస్తూ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆదానీకి సంబంధించిన అవినీతి ఆరోపనలపై పార్లమెంట్ ఉమ్మడి కమిటీ విచారణ జరిపేందుకు పీఎంకే మద్దతు ఉంటుందని, ఈ వ్యవహారంలో తమకు ఎలాంటి సంకోచం లేదన్నారు. టీఎన్ఈబీకి ఆదానీ సంస్థ పెద్ద మొత్తంలో ముడుపులు చెల్లించిందనే ఆరోపనలపై ముఖ్యమంత్రి స్టాలిన్ ఎలాంటి సమాధానం చెప్పకుండా కాలయాపన చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ఆదానీ సంస్థ వంటి పలు సంస్థల నుంచి లబ్దిపొందాలన్న దృష్టితోనే డీఎంకే పాలకులు అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేశారని, దీనిపై తమ పార్టీ పలు మార్లు సమాజిక మాధ్యమాల ద్వారా ప్రభుత్వాన్ని ప్రశ్నించినా ఎలాంటి సమాధానం లేదన్నారు. ఆదానీ సంస్థల నుంచి ముడుపులు పొందినట్లు వస్తున్న ఆరోపనలపై సీబీఐ విచారణకో, సుప్రీం కోర్టు పర్యవేక్షణలో సీబీఐ విచారణకు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రభుత్వం సిద్ధమేనా అని అన్బుమణి ప్రశ్నించారు.

దూది బండిళ్ల కంటైనర్ లారీ దగ్ధం

చెన్నై, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా శంకగిరి వద్ద దూది బండిళ్లతో వెళుతున్న కంటైనర్ లారీ మంటల్లో దగ్ధమైంది. రామనాథపురానికి చెందిన సెల్వం అనే డ్రైవర్ సత్య మంగళం నుంచి దూది బండిళ్లలోడుతో ఆ కంటైనర్ లారీ తీసుకెళ్తున్నాడు.. సోమవారం అర్ధరాత్రి శంకగిరి వీఎన్ పాళయం రహదారిలో సెల్వం టైర్లలో గాలి తనిఖీ చేస్తుండగా ఉన్నట్లుండి కంటైనర్ లోపల మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికుల సాయంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో అగ్నిమాపక దళానికి ఫిర్యాదు చేశారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. శంకగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.



కంటైనర్ నుండి దూది బండిళ్లను దింపుతున్న కార్మికులు